మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

దినపత్రిక

NETI EVARTHALU

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 22-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 173 Issue: 173

22 డిసెంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:45 సూర్యాస్తమయం - సా. 5:43 తిథిః విదియ ఉ. 10:50 వరకు తరువాత తదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ తె. 5:230 వరకు తరువాత శ్రవణ యోగం ధ్రువ సా. 4:34 వరకు కరణం కౌలవ ఉ. 10:50 వరకు తైతుల రా. 11:32 వరకు వర్జ్యం మ. 12:15 నుండి మ. 1:59 వరకు దుర్ముహూర్తం మ. 12:36 నుండి మ. 1:20 వరకు మ. 2:48 నుండి మ. 3:31 వరకు రాహుకాలం ఉ. 8:08 నుండి ఉ. 9:30 వరకు యమగండం ఉ. 10:52 నుండి మ. 12:14 వరకు గుళికాకాలం మ. 1:36 నుండి మ. 2:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:09 నుండి తె. 5:57 వరకు అమృత ఘడియలు రా. 10:37 నుండి రా. 12:20 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:36 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial www.evarthalu.com



కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నీటి వాటా విషయంలో కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చాక పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే నీటి విషయంలో కూడా పోరాడకుంటే ఇదేమి దద్దమ్మ ప్రభుత్వం అని ప్రశ్నించారు. ఇంత చేతగాని, నోరు లేని ప్రభుత్వం ఉంటే ఎలా?, 10 టీఎంసీల నీటి వాటాను కోల్పోతేనే ఒక్కొక్క రాష్ట్రం దానిని సాధించుకునేందుకు బలంగా పోరాడుతుందని అన్నారు.

# తోలు తీస్తా

## నేనే రంగంలోకి దిగుతున్నా..

రెండేళ్ల పాటు మౌనంగా ఉన్నా.. నీటి వాటాపై సర్కారు నిద్ర మత్తు

పాలమూరు ఎత్తిపోతలపై నిర్లక్ష్యం.. ఇక ప్రజా ఉద్యమాలు చేస్తాం

భారీ బహిరంగ సభలు పెడ్తాం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడ్తాం



హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణలో మాత్రం ప్రాజెక్టులను ఆగం చేస్తే పరిస్థితి వస్తే పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన ఈరోజు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటే పాలమూరు పాలిట పెను శాపంగా మారిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ముఖ్యంగా సమైక్య పాలనలో మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ఈరోజు సమావేశంలో పాలమూరు ప్రాజెక్టుకు చేసిన ద్రోహంపైనే చర్చ జరిగిందని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో ఎక్కువ అన్యాయానికి గురైన జిల్లా పాలమూరు అని, ఆ జిల్లా ప్రాజెక్టులకు 174 టీఎంసీలు



# ముందు అసెంబ్లీకి రా

## జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు

దమ్మంటే సభకు వచ్చి మాట్లాడాలి.. కేసీఆర్ కుటుంబం కోసం తెలంగాణ తాకట్టు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు... కేసీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి

కలుగులో దాక్కున్న ఎలుక బయటకు వచ్చినట్లుగా.. ఇప్పుడు కేసీఆర్ బయటకు వచ్చి అసత్యాలు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ చేసిన విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ఘాటుగా బదులిచ్చారు. కేసీఆర్ మారుతారని ఆశించాని.. కానీ ఆయన భాషలో గానీ, అబద్ధాలు చెప్పే అలవాటులో గానీ ఎలాంటి మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కేవలం ప్రెస్ మీట్‌లకే పరిమితం కాకుండా.. ప్రజల పక్షాన నిలబడాలంటే సభకు రావాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): 'వచ్చే జనవరి 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం. దమ్మంటే కేసీఆర్ సభకు రావాలి. తెలంగాణకు ఎవరు మేలు చేశారు, ఎవరు అన్యాయం చేశారో అక్కడే తేల్చుకుందాం' అని రేవంత్ స్పష్టం చేశారు. కేసీఆర్ తన కుటుంబ ప్రయోజనాల కోసం తెలంగాణను తాకట్టు పెట్టారని.. ఇప్పుడు అధికారంలో లేకపోయేసరికి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ అస్తవ్యస్తం చేశారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని.. ఆయన ఒక 'ఆర్థిక ఉగ్రవాది' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి నాలుగు వైపుల నుండి ఆదాయం వచ్చే మార్గాలు తరువాయి 2 వ పేజీలో...




| | |
|---|---|
| బంగారం (గ్రాము)-24 క్యారెట్స్): | రూ.13,418 |
| వెండి (గ్రాము): | రూ.226 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,535 |



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన శీతాకాల విడిదిలో భాగంగా సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హెూం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తేనీటి విందుకు తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి ఏటా చేపట్టే శీతాకాల పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేశారు.



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి మేడారం మహా జాతర-2026 అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దానసరి అనసూయ (సీతక్క) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ముఖ్యమంత్రికి సమ్మక్క తల్లి కంకణం కట్టి, నుదుట బొట్టు పెట్టి ఆశీర్వదించారు. సమ్మక్క-సారలమ్మ ఉత్సవాలు వచ్చే ఏడాది జనవరి 28-31 వరకు వైభవంగా జరగనున్నాయి.

## విశ్వవాణి



ఫిన్లాండ్ పోలీసులు చోరీకి గురైన ఓ కారును గుర్తించి, దొంగ కోసం వెతుకులాట ప్రారంభించారు. అయితే, ఆ కారులో ఒక దోమ చనిపోయి కనిపించింది. ఆ దోమను పట్టుకొని, అది పీల్చిన రక్తం ఎవరిదో డీఎన్ఏ పరీక్ష చేయించారు. దాంతో కారు దొంగ ఎవరనేది తెలిసిపోయింది.

# రైల్వే చార్జీల కూత

## టికెట్ ధరలు పెంచిన రైల్వే శాఖ.. 256 నుంచి అమల్లోకి కొత్త ధరలు



భారతీయ రైల్వే శాఖ టికెట్ ధరలను సవరించింది. ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం పొందడమే లక్ష్యంగా, టికెట్ ధరలను పెంచింది. పెంచిన ధరలు డిసెంబరు 26 నుంచి అమల్లోకి వస్తాయని రైల్వే శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

న్యూఢిల్లీ: తాజా ధరల సవరణ ప్రకారం... 215 కిలోమీటర్ల వరకు జనరల్ టికెట్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అంతకుమించి ఎక్కువ దూరం ప్రయాణించే వారికి కిలోమీటరుకు 1 పైసా చొప్పున అదనపు చార్జీ పడుతుంది. అదే సమయంలో ఎక్స్ ప్రెస్, మెయిల్, నాన్ ఏసీ రైళ్లలో కిలోమీటరుకు రెండు పైసలు చొప్పున పెరగనుంది. అటు, నాన్ ఏసీ రైళ్లలో 500 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి టికెట్ పై అదనంగా తరువాయి 2 వ పేజీలో...



# కాంగ్రెస్‌వి జాతి వ్యతిరేక చర్యలు

## 'సర్'ను అడ్డుకొనే ప్రయత్నాలు.. అస్సాం సభలో ప్రధాని మోదీ

దిబ్రుగఢ్ (అస్సాం): కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆ పార్టీ జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తున్న వలసదారులు అస్సాంలో స్థిరపడేందుకు సహకరిస్తోందని విమర్శించారు. అస్సాంలోని దిబ్రుగఢ్ జిల్లాలో రూ.10,601 కోట్లతో నిర్మించిన ఎరువుల తయారీ కర్మాగారాన్ని మోదీ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతోనే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కాంగ్రెస్ అడ్డుకుంటోందని తరువాయి 2 వ పేజీలో...



# మహాలక్ష్మితో లాభాల్లోకి ఆర్టీసీ

## మహాలక్ష్ముల ప్రయాణానికి ప్రత్యేక కార్డులు

నిజామాబాద్, వరంగల్‌కు 100 ఎలక్ట్రిక్ బస్సులు

రజక, నాయిబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్

ఉప ఉఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అదే విధంగా ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్లలోని నిరుపేద విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలను తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

22.12.2025

మేషం: భూ క్రయ విక్రయాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థిక వ్యవహారాలు ఆశజనకంగా ఉంటాయి. సోదరులతో వివాదాలు రాజి చేసుకుంటారు. ఉద్యోగులకు అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృషభం: రావలసిన సొమ్ము సకాలంలో చేతికందుతుంది. పాత బాకీలు కొంత వరకు తీరుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

మిధునం: నిరుద్యోగుల ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. సంతాన విద్యా విషయంలో మిశ్రమ ఫలితాలుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి పని ఒత్తిడి పెరిగి తగిన విశ్రాంతి లభించదు. వ్యాపారాలు మందగిస్తాయి. ఇంటా బయట సమస్యలు పెరుగుతాయి.

కర్కాటకం: దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులులో శ్రమాధిక్యత పెరుగుతుంది.కీలక వ్యవహారాలలో కుటుంబ సభ్యులతో వివాదాలుంటాయి. వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. నిరుద్యోగులకు ప్రయత్న లోపం వలన లభించిన అవకాశాలు చేజారుతాయి. ఆర్థిక వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. మిత్రులతో చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాల విస్తరణకు అవరోధాలు అధిగమిస్తారు. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు. సంతాన శుభకార్య విషయాలపై చర్చలు ఫలిస్తాయి. అవసరానికి చేతికిడబ్బు అందుతుంది.

కన్య: బంధు వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చూడతారు. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

తుల: ఋణదాతల ఒత్తిడి నుండి అధికమై నూతన ఋణాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. వ్యాపారాలలో ఊహించని నష్టాలు తప్పవు. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమ ఫలించదు. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు.

వృశ్చికం: ఆస్తి వ్యవహారాలలో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిదానిస్తాయి. మాతృ వర్గ బంధువుల నుండి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు నష్టాలు కలిగిస్తాయి. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి.

ధనస్సు: వివాదాలకు సంభందించి మిత్రుల నుండి కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో ఓర్పుతో మీ సమస్యల నుండి బయటపడతారు. వ్యాపారమునకు నూతన పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ పొందుతారు.

మకరం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. వ్యాపారాలు మరింత నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. రుణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

కుంభం: ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. వృత్తి వ్యాపారమున ఆశించిన లాభాలు పొందుతారు. బంధు మిత్రులతో గృహమున సందడిగా గడుపుతారు.

మీనం: కొన్ని వ్యాపావహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సన్నిహితుల నుండి ఊహించని సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. దైవ సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

# తోలు తీస్తా




మొదటి పేజీ తరువాయి

రావాల్సి ఉందని కేసీఆర్ అన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ కానీ.. దాదాపు 20 ఏళ్లు పాలించిన టీడీపీ కానీ.. పాలమూరు తిరిగి కోలుకోలేని దెబ్బ కొట్టాయని ఆరోపించారు. అప్పర్ కృష్ణా, బీమా, తుంగభద్ర ఎడమ కాల్వ ప్రాజెక్టుల ద్వారా ఆనాటికి 174 టీఎంసీలు పాలమూరు–రంగారెడ్డికి రావాల్సి ఉండేదని అన్నారు.

### తెలంగాణకు శనిలా బీజేపీ

బీజేపీ తెలంగాణకు శనిలా తయారయ్యిందని కేసీఆర్ విమర్శించారు. చంద్రబాబు నాయుడు మాటలు విని, ఇప్పటికే అనుమతులున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపిందని అన్నారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సప్పుడు చేస్తలేదని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకొని, ఇష్టమొచ్చినట్లు పునాది రాళ్ళు వేశాడని విమర్శించారు. ఈ పునాది రాళ్ళను తీసుకెళ్లి కృష్ణానదిలో అడ్డం వేస్తే చెక్ డ్యామ్ అయ్యేది అని ఉద్యమం సమయంలో తాను అనేవాడిని అని అన్నారు. ఇదిలాఉంటే, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చాక పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆరోపణలు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందాలు, కమిషన్‌లు తప్ప, రాష్ట్ర ప్రజలు, రైతులు, ప్రాజెక్టుల గురించి పట్టించుకోదా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులను ఎందుకు నిర్వీర్యం ఎందుకు చేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ పరిణామాల వెనక ఎవరి ఒత్తిడి ఉంది?, ఏం కుట్ర దాగి ఉంది? అని ప్రశ్నించారు.

### నేనే రంగంలోకి దిగుతున్నా

'రెండేళ్ల నుంచి నేను మౌనం పాటిస్తూ చూసుకుంటూ వచ్చాను, ఇక తప్పనిసరి పరిస్థితులలో నేను బయలుదేరాను, కేంద్రం తీరును బయటపెడతాం, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగడుతాం, ఈ రోజు సమావేశంలో విస్తారంగా చర్చించాం, చాలా పెద్ద ప్రజా ఉద్యమానికి శ్రీకారం చూడతాం. తప్పకుండా పాలమూరు – రంగారెడ్డి – నల్గొండ జిల్లాల్లో గ్రామగ్రామాన ప్రజా ఉద్యమాలు చేస్తాం, పోస్టర్ డిజైన్ జరుగుతుంది, భారీ బహిరంగ సభలు పెడతాం, బహిరంగ సభలకు నేను స్వయంగా హాజరవుతాను. ప్రజా క్షేత్రంలో ఈ ప్రభుత్వాన్ని ఎండగడతాం, తెలంగాణ తరఫున ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకుంటే ఎవరు మాట్లాడాలి?, మా మీద రెండు బాధ్యతలు ఉన్నాయి, ఒకటి తెలంగాణ తెచ్చిన పార్టీగా, రెండోది ప్రధాన ప్రతిపక్షంగా మా డ్యూటీ మేము చేస్తాం. అడ్డం పొడువు మాట్లాడి కారుకూతలు కూస్తామంటే నడవది, ఇయ్యాల్టి దాకా వేరు కథ, రేపటి నుంచి వేరే, ఎక్కడికక్కడ తోలు తీస్తాం, మేము వాళ్లు అధికారంలోకి వచ్చారని, మేము అధికారం కోల్పోయామని పిచ్చి పిచ్చి పనులు చేయలేదు, ఈ ప్రభుత్వానికి సరిపడ సమయం ఇచ్చాం, కేవలం ఇష్యూలపై, దోపిడీలపై, దందాలపై మాత్రమే పోరాడాం. ఇప్పుడు మొదటికే ముప్పు వచ్చే పరిస్థితి ఉంది. గోదావరిపై ఏపీ ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు దోపిడీకి తెరలేపితే దాని మీద సప్పుడు లేదు. కృష్ణా జలాల్లో పాలమూరు ఎత్తిపోతల విషయంలో కూడా అదే నిర్లక్ష్యం కనిపిస్తుంది. మరి రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నట్టు?, ఏం చేయడానికి ఉన్నట్టు?, రాష్ట్రంలో ఏం జరుగుతున్నట్టు?. నేను రంగంలోకి దిగుతున్నాను, ఈరోజు నిర్ణయం కూడా జరిగింది, రెండు, మూడు రోజులలో ఆయా జిల్లాల నాయకులతో సమావేశమై పెద్ద ఎత్తున గ్రామగ్రామాన సమావేశాలు నిర్వహిస్తాం. ప్రజలకు జరిగే అన్యాయాన్ని, జల దోపిడీని అడ్డుకుని తీరుతాం. తెలంగాణ కోసం ఎక్కడిదాకైనా పోతాం, ఎవరితోనైనా కొట్లాడుతాం. రాష్ట్రం హక్కులను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇన్ని దుర్మార్గాల జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉండాలి' అని కేసీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఐటీ రంగంలో, లా అండ్ ఆర్డర్‌లో క్రమ పద్ధతిలో ముందుకు వెళ్లిందని అన్నారు. ఇప్పుడు జంట నగరాలలో పట్టపగలు హత్యలు జరిగితే అడిగితే దిక్కు లేదని అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసే ఉద్దేశంలో ఉన్న ప్రజలను, పచ్చి అబద్ధాలు, దొంగ మాటలు, హామీలు ఇచ్చి వారిని మోసం చేశారని ఆరోపించారు.

### ఫ్యూచర్ సిటీ.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా

' అనుకోకుండా కొన్ని ప్రాంతాలకు, కొన్ని రాష్ట్రాలకు కలిసొస్తాయి. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో కలరా వ్యాధి వ్యాపించి ప్రజలు ఇబ్బడి ముబ్బడిగా చనిపోయారు. అప్పుడు ఎక్కడికక్కడ లోకలైజ్డ్ ప్రొడక్షన్ ఉండాలని ఐడీపీఎల్ అని పెట్టారు. వాటిని కొన్ని కీలక రాష్ట్రాల్లో పెట్టారు. అందులో ఒకటి హైదరాబాద్‌కు వచ్చింది. ఐడీపీఎల్ పుణ్యమా అని కొంతమంది నేర్చుకుని బయటకొచ్చి స్వయంగా కంపెనీలు పెట్టి విస్తరించారు. వాటిలో అంజిరెడ్డి ఒకరు.. ఆయన దగ్గర పనిచేసిన వాళ్లు కూడా బయటకొచ్చి వాళ్లు కూడా కంపెనీలు పెట్టారు. ఇలా హైదరాబాద్ నగరం మెడికల్, ఫార్మా హబ్‌గా మారింది. అలా ఫార్మా ఎకో హైదరాబాద్‌లో బిల్డ్ అవ్వడం వల్ల ఇబ్బడిముబ్బడిగా కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయి. ఇప్పుడు మూడో వంతు ప్రపంచానికి జీనోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సిన్ సరఫరా అవుతుంది.' అని కేసీఆర్ తెలిపారు. నిజాం కాలం నుంచి ఫార్మా కంపెనీలు వస్తూ వస్తూ.. హైదరాబాద్ ఫార్మారంగానికి బెస్ట్ డెస్టినేషన్‌గా మారిందని కేసీఆర్ తెలిపారు. అయితే ఆ కంపెనీల్లోని రసాయన కారకాలు ఇబ్బందిని కలిగిస్తాయి. దీని నుంచి హైదరాబాద్‌ను బయటపడాలి.. అలా అని ఫార్మాను వదులుకోలేం.. అందుకే నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను వెతికామని తెలిపారు. ' మందులు తయారుచేసే క్రమంలో కొంత వేస్టేజి ఉంటుంది.. దాన్ని ఎలా మేనేజ్ చేయాలంటే కొంత తెలివి కావాలి. ఒక ఫార్మా కంపెనీ ముందు నుంచి వెళ్తే మన దగ్గర వాసన వస్తది.. అదే వేరే దేశంలో అయితే అలా రాదు.. వాటి గురించి తెలుసుకోవడానికి ప్రపంచ దేశాలు తిప్పించాం. ప్రపంచవ్యాప్తంగా తిప్పి ఒక ఆలోచనకు వచ్చాం. ఈ క్రమంలోనే జడ్ఎల్‌బీ అని వచ్చింది.. అంటే జీరో లిక్విడ్ బేస్. వ్యర్థాలను జీరో లిక్విడ్ చేస్తారు. దాని వల్ల కాలుష్యం రాదు. అంతర్జాతీయంగా అది సక్సెస్ అయ్యింది. అయితే మనం ఆ సిస్టమ్ పెట్టుకోవాలని.. అలాగే ఫార్మా యూనివర్సిటీ పెట్టుకోవాలని అనుకున్నాం. ' అని కేసీఆర్ వివరించారు. ఈ ఆలోచనతో హైదరాబాద్‌లోని ఫార్మా రంగానికి చెందిన వ్యాపారవేత్తలను నేనే స్వయంగా హెలికాప్టర్‌లో తీసుకెళ్లి ముచ్చర్లలోని స్థలాన్ని చూపించానని తెలిపారు. వాళ్లు కూడా ఆ స్థలం సెట్ అవుతుందని చెప్పడంతో ఫార్మా సిటీ నిర్మాణానికి రూపకల్పన చేశామన్నారు. దీనికోసం ఐదారు సంవత్సరాలు కష్టపడి, రైతాంగంతో ఘర్షణ పడకుండా 14 వేల ఎకరాలను సమీకరించామని తెలిపారు. 20 వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకుంటే తాము అధికారంలో ఉన్న సమయంలో 14 వేల ఎకరాలను సమీకరించగలిగామని పేర్కొన్నారు. జీడిమెట్ల, చర్లపల్లిలోని ఫార్మా కంపెనీలను కూడా సంప్రదిస్తే ప్రత్యామ్నయ స్థలం చూపిస్తే తరలివెళ్లేందుకు సిద్ధమేనని సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. కామన్ అఫ్లియెటెడ్ ప్లాంట్స్ పెట్టి.. వ్యర్థాలను ఇష్టమొచ్చినట్లు వదిలేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిఘా ఉండేలా పెట్టుకున్నదే ఫార్మా సిటీ అని చెప్పారు. దానికి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కూడా వచ్చిందని అన్నారు. అలా హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీలు మొత్తం ఒకే దగ్గరికి తీసుకెళ్లి ఫార్మా సిటీ కట్టాలని ప్లాన్ చేశామని తెలిపారు. దాని పక్కనే మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేశామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని ఏదైనాచేసి అమ్ముకోవాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఏం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డిని కేసీఆర్ ప్రశ్నించారు. నీ ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ ఎవడికి కావాలన్నారు. హైదరాబాద్‌ను నువ్వేమైనా పెంచావా అని నిలదీశారు. 400 ఏండ్ల చరిత్రతో హైదరాబాద్ పెద్ద సిటీ అయ్యిందని తెలిపారు. ఇలా అన్ని రాష్ట్రాలకు పెద్ద సిటీలు తయారవవ్వని తెలిపారు. బెంగాల్‌కు కోల్‌కతా ఉంది.. మహారాష్ట్రకు ముంబై ఉంది.. మనకు హైదరాబాద్ ఉంది.. కర్ణాటకకు బెంగళూరు ఉంది.. తమిళనాడుకు చెన్నై ఉంది.. ఢిల్లీ ఇవి కాకుండా వేరే రాష్ట్రాలకు లేవు అని గుర్తుచేశారు. అంత చరిత్ర ఉన్న హైదరాబాద్ మహానగరాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా సిటీ తీసుకొచ్చామని తెలిపారు. ఇవాళ సిటీ మొత్తం గబ్బు లేచిపోవాలి.. నువ్వేమో ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ అని దిక్కుమాలిన పాలసీలు తీసుకొస్తూ.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేస్తున్నావని మండిపడ్డారు.

### నేను చనిపోవాలని శాపాలు

'నన్ను దూషించడం, నేను చనిపోవాలని శాపాలు పెట్టడమే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమ'ని ప్రభుత్వంపై కేసీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏరోజు ఇలాంటి అహంకారపూరిత హింస ప్రయత్నాలు చేయలేదని కేసీఆర్ తెలిపారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలో నేర్పుతున్నదని అన్నారు. గుడ్ల తీయడం, లాగులో తొండలు ఇడవడం వంటివి ఎలా చేయాలో చెబుతున్నదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో ఒక్క కొత్త పాలసీని కూడా తీసుకురాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించకపోగా.. ఉన్నవాటిని కూడా ఆపేందని అన్నారు. తీసుకొచ్చిన పాలసీ అంతా కూడా రియల్ ఎస్టేట్‌కు సంబంధించినదే అని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు యూరియా రైతుల ఇంటికి, చేను వద్దకు డైరెక్ట్‌గా వచ్చేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు యూరియా బస్తా కోసం రైతు కుటుంబమంతా లైన్‌లో నిలబడే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.

# మహాలక్ష్మితో లాభాల్లోకి ఆర్టీసీ

మొదటి పేజీ తరువాయి

200 శాతం పెంచామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్, మెస్ చార్జీల బిల్లులను చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం నాడు ప్రజాభవన్ లో ఆర్టీసీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ అధికారులు, ఎంజెపి కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసి బలోపేతం చేసేందుకు, కార్మికులను ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి కీలకమైన చర్యలను తీసుకుంటోందని అన్నారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ లభాల్లోకి వచ్చిందని అన్నారు. అంతేగాక మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకోవడంతో పాటుగా, ప్రభుత్వం అందించిన సహకారంతో సంస్థకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అంతేకాక బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్ ల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం సహకారం అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటుగా సంస్థ స్వతహాగా నూతనంగా ఆదాయా మార్గాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆర్టీసీ లో మహాలక్ష్మీ పథకం కింద ఇప్పటి వరకు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు జరగాయి. మహాలక్ష్మీ పథకం వల్ల మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నట్లు ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో పీఎఫ్ బకాయిలు రూ. 1400 కోట్లు ఉండగా.. ప్రజాప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ. 660 కోట్లకు తగ్గించినట్లు ఆయన చెప్పారు. అలాగే సీసీఎస్ బకాయిలు గతంలో రూ.600 కోట్లు ఉండగా ప్రజాప్రభుత్వం వచ్చాక.. రూ.373 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. ఆర్టీసీ లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కోసం సెంట్రల్ ఫర్ గుడ్ గుడ్ గవర్నెన్స్ తో ఒప్పందం చేసుకొని ప్రత్యేక కార్డులు పంపిణీ చేయాలని అధికారులను బట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ కార్డులు తెలంగాణలోని ప్రతి మహిళకు చేరాలని అధికారులకు ఆయన సూచించారు.ఆర్టీసీలో పీఎం ఈ -డ్రైవ్ కింద హైదరాబాద్ లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని వీటికి చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పీఎం ఈ -డ్రైవ్ కింద నిజామాబాద్ వరంగల్ పట్టణాలకు 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్, షూస్ పంపిణీ చేయాలని అందుకు సంబధించిన నిధులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశించారు. నాయి బ్రాహ్మణ, రజకకుల సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్తుకు సంబధించిన బకాయిలు లేకుండా చూస్తూ నెల వారిగా ఎప్పటికప్పుడు విడుదల చేయాలని అధికారులు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజాప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఒకేసారి వంద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసిందని చెప్పారు. గతంలో ఎంజేపిలో 327 గురుకులాలకు కేవలం 26 గురుకులాలకు మాత్రమే సొంత భవనాలున్నాయని చెప్పారు. ప్రజాప్రభుత్వం వంద ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు కార్పొరేట్ తరహాలో భవనాలను నిర్మిస్తోందని అన్నారు. గురుకులాల స్కూల్ అద్దె కోసం మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీల కోసం రూ.152 కోట్లు విడుదల చేశారని చెప్పారు. గీత వృత్తిదారుల రక్షణకు ఇప్పటి వరకు 30 వేల కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల నియామకాలకు అనుమతి ఆర్థిక శాఖ నుంచి అనుమతి ఇవ్వాలన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా మార్చ్ 2026 వరకు 3233 కండక్టర్ పోస్టులు అవసరం ఉండగా తాత్కాలికంగా నియామకాలు జరపడంతో పాటు 50 శాతం రెగ్యులర్ నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. వాటితో పాటు చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతేకాక డ్రైవింగ్ లైసెన్స్ ల జారిలో ఉన్న ఇబ్బందులు తేలెత్తకుండా యూజర్ ఛార్జీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. రవాణా శాఖ లో ఎన్ఫోర్స్మెంట్ పెంచడానికి కొత్త వాహనాలకు అనుమతి ఇవ్వాలని ,టాక్స్ కలెక్షన్ కోసం ట్యాబ్ లు మంజూరు చేయాలని కోరారు.

# ముందు అసెంబ్లీకి రా

మొదటి పేజీ తరువాయి

ఉన్నా.. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల అంచనాలను పెంచి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు వాత పెట్టారని.. అందుకే ఇప్పుడు వచ్చి మాట్లాడుతున్నారన్నారు. గజ్వేల్‌లో కూడా కాంగ్రెస్ జెండా ఎగరడం కేసీఆర్ పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను రేవంత్ కొట్టిపారేశారు. 'కృష్ణా జలాల్లో ఏపీకి 64 శాతం, తెలంగాణకు 36 శాతం చాలని సంతకం పెట్టిన ద్రోహి కేసీఆర్. యూరియా పంపిణీలో టెక్నాలజీ వద్దా.. యాప్ పెడితే నష్టమేంటి?. కృష్ణా బేసిన్ దెబ్బతినడానికి, రైతులు నష్టపోవడానికి కారణం కేసీఆరే' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ సమయంలో పాలమూరు ప్రజలను కేసీఆర్ మోసం చేశారని.. కేవలం ఓట్ల కోసమే సెంటిమెంట్‌ను వాడుకున్నారని విమర్శించారు. చంద్రబాబుతో లాలూచీ పడి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే పెండింగ్ ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తున్నామని.. ప్రజల ఆస్తుల విలువలు తగ్గలేదు సదా పెరుగుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

# రైల్వే చార్జీల కూత

మొదటి పేజీ తరువాయి

రూ.10 పెంచారు. గడచిన దశాబ్దకాలంలో రైల్వే శాఖ తన కార్యకలాపాలను మరింత విస్తృతం చేసిందని, అందుకు అనుగుణంగా మానవ వనరుల శక్తి పెంచుకోవాల్సి ఉందని, ఆదాయం కూడా అవసరమని రైల్వే శాఖ తన ప్రకటనలో పేర్కొంది. 2024–25లో జీతాలు, ఇతర ఖర్చుల రూపేణా రూ.1.15 లక్షల కోట్లు చెల్లించగా, రూ.60 వేల కోట్లతో పెన్షన్లు చెల్లించామని, మొత్తంగా రూ.2.63 లక్షల కోట్ల వ్యయం అయిందని రైల్వే శాఖ వివరించింది. ఆదాయ పెంపు మార్గాల్లో భాగంగా ప్రయాణికులపై చార్జీలు పెంచడంతో పాటు సరకు రవాణాను అధికం చేయడంపైనా దృష్టిసారిస్తున్నామని పేర్కొంది.



# కాంగ్రెస్‌వి జాతి వ్యతిరేక చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. బంగ్లాదేశ్ వలసదారులకు అస్సాంలో ఆశ్రయం కల్పించడం ద్వారా కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలనే ఉద్దేశంతో ఉందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజల గుర్తింపు, ఉనికి, ఆత్మగౌరవం గురించి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం పట్టింపు లేదని మండిపడ్డారు. 'ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డుకునేందకు కాంగ్రెస్ అడుగడుగునా ప్రయత్నిస్తోంది. నేనేం మంచి చేయాలనుకున్నా.. దానికి మోకాలడ్డుతోంది. ప్రజల గౌరవం, ఉనికిని కాపాడేందుకు బీజేపీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల నుంచి అస్సాంను కచ్చితంగా రక్షించాల్సిన అవసరం ఉంది. అందుకు బీజేపీ ఓ రక్షణ కవచంలా నిలుస్తుంది' అని మోదీ పేర్కొన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పోస్టులు

మొత్తం పోస్టులు: 514

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

దరఖాస్తు చివరి తేదీ: జనవరి 05, 2026 వరకు

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులైన వారు

వయోపరిమితి: 25-40 ఏళ్ల మధ్య గలవారు

పరీక్ష విధానం: ఆన్‌లైన్

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ప్రతిభ ఆధారంగా

# గాదె ఇన్నయ్య అరెస్టు



**14 రోజుల రిమాండ్..**

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**

జనగామ, డిసెంబర్ 21 (ఈవార్తలు): మావోయిస్టులకు మద్దతుగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ప్రముఖ సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అరెస్ట్ చేశారు. తెలంగాణలోని జనగామ జిల్లాలో ఆదివారం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి ఆదివారం ఉదయం చేరుకున్న ఎన్ఐఏ బృందాలు, ఆయన్ను గంటకు పైగా ప్రశ్నించి అదుపులోకి తీసుకున్నాయి. ఇటీవల మరణించిన మావోయిస్టు అగ్రనేత కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియల సందర్భంగా ఇన్నయ్య మావోయిస్టు ఉద్యమానికి మద్దతుగా రెచ్చగొట్టే ప్రసంగం చేశారని ఎన్ఐఏ ఆరోపించింది. నిషేధిత సీపీఐ (మావోయిస్ట్) సంస్థకు మద్దతు కల్పించడం, వారి కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఉండటం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలను పురిగొల్పడం వంటి అభియోగాలపై ఇన్నయ్యపై కేసు నమోదు చేశారు. ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా)లోని సెక్షన్లు 13, 29తో పాటు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152 కింద కేసులు నమోదు చేసినట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఇన్నయ్యపై ఉపా కింద కేసు నమోదు కావడం ఇది మొదటిసారి కాదు. 'భారత్ బచావో' అనే సంస్థలో నాయకుడిగా ఉన్న ఆయనపై 2023లో కూడా ఇలాంటి కేసే నమోదైంది. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ చంద్రన్నకు నిధులు చేరవేస్తున్నారన్న ఆరోపణలతో అప్పట్లో కేసు నమోదు చేశారు. ఆ కేసులో ఖమ్మంకు చెందిన వైద్యుడు డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్‌తో పాటు మరికొందరి పేర్లను చేర్చారు. గతంలో నక్సలైట్‌గా ఉండి, ఆ తర్వాత సామాజిక కార్యకర్తగా మారిన ఇన్నయ్య, ప్రభుత్వ విధానాలను, ముఖ్యంగా మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎన్ఐఏ నిఘాలో ఉన్నట్లు తెలుస్తోంది. తాజా అరెస్టుతో మావోయిస్టు సానుభూతిపరులు, అర్బన్ నక్సలైట్లపై ఎన్ఐఏ తన దృష్టిని మరింత కేంద్రీకరించినట్లు స్పష్టమవుతోంది.

## బీఆర్ఎస్ గెలుపునకు థ్యాంక్స్

**కార్యకర్తలు, నేతలకు కేసీఆర్ ధన్యవాదాలు**



హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): పంచాయతీ ఎన్నికల్లో 3,502 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందడం తెలిసిందే. దీనిపై పార్టీ అధినేత కేసీఆర్ స్పందించారు. నేడు హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ శాసనసభాపక్ష, రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పాటుపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరిగి ఉంటే బీఆర్ఎస్ సత్తా తెలిసేదని వ్యాఖ్యానించారు. అధికార గర్వంతో విర్రవీగుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ అహంకార ధోరణి ప్రదర్శించలేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ఏదేమైనా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని అన్నారు.

## కోడిగుడ్డు రూ.8

**ఒక్కసారిగా కొండెక్కిన ఎగ్**

హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): సామాన్యుడి పౌష్టికాహారమైన కోడిగుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు రికార్డు స్థాయికి చేరడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. కొద్ది నెలల క్రితం రిటైల్ మార్కెట్లో రూ.5 నుంచి రూ. 6 వరకు పలికిన ఒక్కో గుడ్డు ధర, ప్రస్తుతం రూ.8కి చేరింది. హోల్‌సేల్ మార్కెట్లోనే గుడ్డు ధర రూ.7.30 పైగా పలుకుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు 30 గుడ్లు ఉన్న ట్రే ధర రూ.160 నుంచి రూ.170 మధ్య ఉండగా, ఇప్పుడు హోల్‌సేల్‌లోనే రూ.210 నుంచి రూ.220కి పెరిగింది. మరోవైపు, నాటు కోడిగుడ్డు ధర ఒక్కొక్కటి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేకపోవడమే ఈ ఆకస్మిక పెరుగుదలకు ప్రధాన కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గతంలో తెలుగు రాష్ట్రాల్లో రోజుకు సుమారు 8 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరిగేది. అయితే, కోళ్లకు అవసరమైన దాణా, మక్కలు, చేపపొట్టు వంటి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో చాలా మంది రైతులు ఫారాల నిర్వహణను నిలిపివేశారు. దీంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. "ప్రస్తుతం హోల్‌సేల్‌లో రూ.7.30, రిటైల్‌లో రూ.8 పలుకుతున్న ధర పౌల్ట్రీ చరిత్రలోనే ఆల్ టైమ్ గరిష్ఠం. మరో రెండు నెలల పాటు ఇదే ధర కొనసాగే అవకాశం ఉంది" అని కోడిగుడ్ల వ్యాపారి ఒకరు తెలిపారు. ఉత్పత్తి సాధారణ స్థాయికి వచ్చే వరకు ధరలు తగ్గే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## హైడ్రా కమిషనర్ గన్ మన్ ఆత్మహత్యాయత్నం!

హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వద్ద గన్ మన్‌గా పనిచేస్తున్న కృష్ణచైతన్య ఆత్మహత్యాయత్నం చేశాడు. కృష్ణచైతన్య ఈ ఉదయం తన ఇంట్లో సర్వీస్ గన్ తో కాల్చుకుని ఆత్మహత్యాయత్నం చేయగా, అతడిని కుటుంబ సభ్యులు హుటాహుటీన హైదరాబాద్ ఎల్బీనగర్ లోని కామినేని హాస్పిటల్ కు తరలించారు. ప్రస్తుతం కృష్ణచైతన్య ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ కామినేని ఆసుపత్రికి చేరుకుని, వైద్యులతో మాట్లాడి అతడి పరిస్థితిని తెలుసుకున్నారు. కృష్ణచైతన్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కృష్ణచైతన్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, అతడు బతికే అవకాశాలు అంతంతమాత్రమేనని వైద్యులు చెప్పారని వెల్లడించారు.

# ఇక తెలంగాణలో 'సర్'

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి**




హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ విషయంలో తెలంగాణ త్వరలో దేశానికే ఆదర్శంగా నిలవనుందని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో) సమావేశంలో ఆయన మాట్లాడారు. తదుపరి దశ ఓటర్ల జాబితా సవరణ తెలంగాణలోనే జరగనుందని తెలిపారు. ఇటీవలే బీహార్‌లో ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతంగా పూర్తిచేసిన ప్రక్రియను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. అక్కడ సుమారు 7.5 కోట్ల మంది ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నా, ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదని, రీపోలింగ్ లేదా రీకౌంటింగ్ అవసరం రాలేదని గుర్తుచేశారు. ఈ విజయానికి కారణమైన బీహార్ బీఎల్‌వోలను ఆయన అభినందించారు. భారత ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌వోలే వెన్నెముక అని, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయం వారి నిబద్ధత, కృషిపైనే ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటానికి ఓటర్ల ఉదాసీనతే ప్రధాన కారణమని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు మాత్రం ఉత్సాహంగా క్యూలలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకుంటూ దేశానికి మార్గనిర్దేశం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రపంచమంతా భారత ఎన్నికల ప్రక్రియను ఎంతో ఆసక్తిగా గమనిస్తోందని చెప్పారు. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో 90 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. 1995లో ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ లో సభ్యదేశంగా చేరిన భారత్, మూడు దశాబ్దాల తర్వాత దానికి ఛైర్మన్‌గా ఎదగడం గర్వకారణమని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్ కుమార్ శర్మ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధోని కోసం మా పిల్లలు నన్నే ట్రోల్ చేశారు

**బాబుల్ సుప్రియో ఆసక్తికర పోస్ట్**



రాంచీ: ప్రముఖ గాయకుడు, నటుడు మరియు రాజకీయ నాయకుడు బాబుల్ సుప్రియో సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన, పాత జ్ఞాపకాన్ని పంచుకున్నారు. టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిని కలవలేకపోయినందుకు తన పిల్లలు తననే ఎలా ఆటపట్టించారో వివరించారు. ఈ మేరకు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "ఈ సంఘటన రాంచీలోని ధోని ఇంటి గేటు ముందు జరిగింది. నా కుమార్తె నైనా, ఆమె కజిన్ గోలు తమ తాతయ్య, అమ్మమ్మలతో కలిసి రాంచీ వెళ్లారు. అక్కడ ధోనిని కలవడానికి వాళ్లు నేరుగా అతడి ఇంటి వద్దకు వెళ్లారు. ధోనీ ఇంటి గేటు ముందు నిల్చుని లోపలికి వెళ్లేందుకు విశ్వప్రయత్నం చేశారు. ధోనీని కలిసేందుకు వారు చేయని ప్రయత్నమంటూ లేదు. అక్కడున్న వాచ్‌మన్‌కి నా విజిటింగ్ కార్డు ఇచ్చారు. అంతేకాకుండా, "మా నాన్న మంత్రి" అని కూడా చెప్పారు. కానీ, వారి ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో నాకు ఫోన్ చేశారు. కానీ ఈ విషయంలో నేను కూడా నిస్సహాయుడ్ని అయ్యాను. ఎందుకంటే ధోనీతో మాట్లాడడానికి అతడి ఫోన్ నెంబరు నా వద్ద లేదు. ధోనీ ఫోన్ చాలా తక్కువగా ఉపయోగిస్తాడట. అది కూడా అతడి ఫోన్ నెంబరు చాలా కొద్దిమంది వద్దే ఉంటుందట. ఈ విషయాన్ని మా పిల్లలతో చెబితే వాళ్లు నన్ను భయంకరంగా ట్రోల్ చేశారు. 'డంబో (దద్దమ్మ)' అంటూ వాయిస్ మెసేజ్ లు పెడుతూ ఓ రేంజిలో నన్ను ఆడుకున్నారు. నేను ఆ సమయంలో ఏం చేయలేకపోయినందుకు బాధపడ్డాను. కానీ, తరాలకతీతంగా ధోని సంపాదించుకున్న ప్రేమను చూస్తే చాలా ముచ్చటగా అనిపించింది" అని బాబుల్ సుప్రియో వివరించారు.

# గాంధీ కుటుంబం వల్లే సూర్యుడు అంటారేమో!

**రేవంత్ క్రిస్మస్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్**



హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిన్న క్రిస్మస్ వేడుకల్లో చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతకీ రేవంత్ రెడ్డి ఏమన్నారంటే... ఇవాళ క్రిస్మస్ వేడుకలను తెలంగాణ రాష్ట్రంలో చేసుకుంటున్నామంటే అందుకు సోనియా గాంధీ చేసిన త్యాగాలే కారణమని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో సోనియా గాంధీ ముఖ్య పాత్ర పోషించారని, డిసెంబరు నెల తెలంగాణకు ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. సోనియా పుట్టింది ఈ నెలలోనే, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది ఈ నెలలోనే అని వ్యాఖ్యానించారు. దీనిపై తెలంగాణ బీజేపీ స్పందించింది. గాంధీ కుటుంబం వల్లే తెలంగాణలో సూర్యుడు ఉదయిస్తాడేమోనని కూడా చెబుతారేమో అని వ్యంగ్యం ప్రదర్శించింది. పొగడ్తలకు కూడా ఓ హద్దు ఉంటుందని, క్రిస్మస్ వేడుకలను కూడా సోనియాకు ఆపాదించడం సరికాదు అని తెలంగాణ బీజేపీ పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దేన్నైనా మార్చేస్తారు... ఒకరిని ఆకాశానికెత్తే ప్రక్రియలో అన్ని హద్దులూ దాటేశారు అంటూ విమర్శించింది. అటు, బీజేపీ జాతీయ నేతలు కూడా రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ స్పందిస్తూ... ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. సోనియా ఏ రోజూ హిందూ విశ్వాసాలపై నమ్మకం చూపలేదని, ఆమె ఇప్పటికీ క్రైస్తవ మతాన్నే అనుసరిస్తున్నారని తెలిపారు. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు తన నివాసంలో క్రిస్మస్ వేడుకలు జరిపారే కానీ, దీపావళి జరపలేదని ఆరోపించారు. బీజేపీ నేత రాజ్ పురోహిత్ స్పందిస్తూ... ఏసు క్రీస్తు త్యాగాలతో సోనియాను పోల్చడం పిచ్చికి పరాకాష్ఠ అని విమర్శించారు. దేశానికి ఆమె కుమారుడ్ని ఇచ్చారా? ఇది ఒక త్యాగమా? ముఖ్యమంత్రి జాగ్రత్తగా మాట్లాడాలి అని హితవు పలికారు.

## పవన్ సిఫారసుతో రూ.35 కోట్లు హర్షణీయం: బండి సంజయ్



కరీంనగర్, డిసెంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 96 గదుల సత్రం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్లు కేటాయించడం హర్షణీయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సిఫారసుతో ఈ నిధులు మంజూరు కావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. దీని వల్ల కొండగట్టుకు వచ్చే భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి గతంలో రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అలాగే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు కేటాయించకపోగా, ఆర్జిత సేవల ఛార్జీలను పెంచి భక్తులపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే కొండగట్టు ఆలయానికి తగిన నిధులు కేటాయించి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. టీటీడీ నిధులతో నిర్మించనున్న సత్రం పూర్తయితే కొండగట్టు దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు వసతి సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## వైద్యుడికి మోసం కేసులో నలుగురి అరెస్టు

హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ సైబర్ మోసం కేసులో కీలక ముందడుగు పడింది. నకిలీ పెట్టుబడుల పేరుతో ఓ వైద్యుడి నుంచి ఏకంగా రూ.14.61 కోట్లు కొల్లగొట్టిన ఘటనలో నలుగురు నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్ర చరిత్రలో ఒకే వ్యక్తి ఇంత భారీ మొత్తంలో మోసపోవడం ఇదే మొదటిసారి కావడంతో ఈ కేసు దర్యాప్తును అధికారులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన బ్రహ్మనాయుడు, పవన్, మణిరామ్, శివకృష్ణను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన సైబర్ నేరగాళ్లకు వీరంతా మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సమకూర్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వైద్యుడి నుంచి కాజేసిన డబ్బును ఈ ఖాతాల ద్వారానే ప్రధాన నిందితులు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను మరింత లోతుగా విచారించేందుకు ఐదు రోజుల కస్టడీకి అనుమతించాలని కోరుతూ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం కోర్టు తన నిర్ణయాన్ని వెలువరించనుంది. నిందితుల విచారణ ద్వారా ఈ సైబర్ మోసం వెనుక ఉన్న ప్రధాన సూత్రధారుల గుట్టు రట్టు చేయవచ్చని సైబర్ క్రైమ్ పోలీసులు భావిస్తున్నారు.



## కీచులాటలు క్రూరత్వం కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: భార్యకు డబ్బులిచ్చి, ఆపై ఆ డబ్బుకు లెక్కలు అడగడం క్రూరత్వం కిందకు రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓ ఎన్నారై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అతడి కుటుంబ సభ్యులపై భార్య పెట్టిన గృహ హింస కేసును కొట్టివేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సంసారంలో జరిగే సాధారణ గొడవలను, కీచులాటలను ఐపీసీ సెక్షన్ 498ఏ కింద నేరంగా పరిగణించలేమని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న దంపతులకు 2016లో వివాహమైంది. వీరికి ఒక బాబు కూడా ఉన్నాడు. 2019లో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య తన కొడుకుతో కలిసి హైదరాబాద్‌లోని పుట్టింటికి తిరిగి వచ్చారు. దాంపత్య హక్కుల పునరుద్ధరణ కోసం భర్త 2022లో నోటీసులు పంపగా, ఆ వెంటనే భార్య హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో భర్త, అతడి కుటుంబంపై గృహ హింస, వరకట్న వేధింపుల కింద ఫిర్యాదు చేశారు. కుటుంబ ఖర్చుల కోసం డబ్బిచ్చిన ప్రతీసారీ భర్త లెక్కలు అడుగుతున్నారని, తనను, బిడ్డను ఆర్థికంగా పట్టించుకోకుండా ఇండియాలోని తన తల్లిదండ్రులకు మాత్రం లక్షల్లో డబ్బు పంపుతున్నారని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. గర్భవతిగా ఉన్నప్పుడు సరిగా చూసుకోలేదని, ప్రసవం తర్వాత బరువు తగ్గాలని వేధించారని కూడా ఆమె పేర్కొన్నారు. ఈ ఆరోపణలను పరిశీలించిన ధర్మాసనం ఇవి సంసారంలో జరిగే సాధారణ వివాదాలు మాత్రమేనని అభిప్రాయపడింది. భర్త తన తల్లిదండ్రులకు డబ్బు పంపడాన్ని తప్పుబట్టలేమని, ఖర్చులకు లెక్కలడగడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. బరువు తగ్గమని చెప్పడం వంటివి వ్యక్తిగత గుణాన్ని సూచిస్తాయి తప్ప, సెక్షన్ 498ఏ కింద నేరం కాదని పేర్కొంది. ఈ కేసులో తొలుత తెలంగాణ హైకోర్టు భర్త పిటిషన్‌ను తిరస్కరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భార్య చేసిన ఆరోపణలు నిరాధారంగా ఉన్నాయని పేర్కొంటూ సర్వోన్నత న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది.



# చలికి తెలంగాణ విలవిల





హైదరాబాద్, డిసెంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణ వ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పలు జిల్లాలు చలి పులి పంజాకు చిక్కి విలవిలలాడుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యంత తక్కువ ఉష్ణోగ్రత కావడం గమనార్హం. గత పదిహేను రోజులుగా ఈ ప్రాంతంలో చలి తీవ్రత అధికంగా ఉంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సిర్పూర్(యు) మండలంలో 4.8 డిగ్రీలు, తిర్యాణి మండలం గిన్నెధరిలో 5.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 5.9 డిగ్రీలకు ఉష్ణోగ్రత పడిపోయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సుమారు 60 ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. ఇక నిజామాబాద్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ చలి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో 8.2 డిగ్రీలు, కామారెడ్డి జిల్లా గాంధారిలో 7.4 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సమీపంలో 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# భారత సైన్యంలోకి 'అశ్ని ప్లాటూన్లు'

**భారత సైన్యంలో డ్రోన్ల విప్లవం**

**వందలాది బెటాలియన్లలో అశ్ని ప్లాటూన్లు**

న్యూఢిల్లీ: భారత సైన్యం యుద్ధ తంత్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. 'ఆపరేషన్ సిందూర్' విజయంతో స్ఫూర్తి పొంది, వేగంగా డ్రోన్ ఆధారిత దళంగా రూపాంతరం చెందుతోంది. ఇందులో భాగంగా వందలాది పదాతిదళ బెటాలియన్లలో ప్రత్యేకంగా 'అశ్ని ప్లాటూన్లు' ఏర్పాటు చేయడంతో పాటు, 850 సూసైడ్ డ్రోన్ల (లోయిటరింగ్ మ్యూనిషన్స్) కొనుగోలు ప్రక్రియను సైన్యం వేగవంతం చేసింది. 2025 మే నెలలో పహల్గామ్‌లో 26 మంది పౌరులను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో సూసైడ్ డ్రోన్లను సమర్థంగా ఉపయోగించి పాకిస్థాన్ భూభాగంలోని జైషే మహ్మద్ (బహావల్‌పూర్), లష్కరే తోయిబా (మురిడ్కే) ఉగ్ర స్థావరాలను కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. మానవ ప్రమేయం లేకుండా కేవలం టెక్నాలజీతో శత్రువును దెబ్బకొట్టడం ఈ ఆపరేషన్ ప్రత్యేకత. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఈ దాడిలో భారత సైన్యం చూపిన వేగం, కచ్చితత్వాన్ని ప్రశంసించారు. ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితో సైన్యం తన యుద్ధ వ్యూహాలను మార్చుకుంటోంది. సైన్యం 2024ను 'సాంకేతిక పరిజ్ఞాన స్వీకరణ సంవత్సరంగా' ప్రకటించింది. అందులో భాగంగానే డ్రోన్ యుద్ధ తంత్రం కోసం 'అశ్ని ప్లాటూన్లు' లేదా 'అశ్ని కంబాట్ యూనిట్లు' తెరపైకి వచ్చాయి. ప్రతి పదాతిదళ బెటాలియన్‌లో 20-25 మంది ప్రత్యేక శిక్షణ పొందిన సైనికులతో ఈ ప్లాటూన్‌ను ఏర్పాటు చేస్తారు. వీరి ఆధీనంలో మొత్తం 10 డ్రోన్ సిస్టమ్స్ ఉంటాయి. వీటిలో నాలుగు నిఘా కోసం కాగా, ఆరు లక్ష్యాలను ఛేదించే సూసైడ్ డ్రోన్లు. ఈ ప్లాటూన్ల ద్వారా సైనికుల ప్రాణాలకు ముప్పు లేకుండా శత్రువు కదలికలను పసిగట్టడం, వారి స్థావరాలపై మెరుపుదాడులు చేయడం సులభతరం అవుతుంది. ప్రస్తుతం దాదాపు 385 పదాతిదళ బెటాలియన్లలో అశ్ని ప్లాటూన్లను విలీనం చేసినట్లు సమాచారం. ప్రతి బెటాలియన్‌కు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం.



ఈ ప్లాటూన్లలో నిఘా, కామికేజ్ డ్రోన్లు, పేలుడు పదార్థాలను కచ్చితత్వంతో జారవిడిచే యూఏవీలు ఉంటాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌ఫాంట్రీ, లెఫ్టినెంట్ జనరల్ అజయ్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత 850 లోయిటరింగ్ మ్యూనిషన్ల కొనుగోలు ప్రతిపాదన తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖరులో రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) దీనికి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. మేక్ ఇన్ ఇండియా కింద దేశీయంగా వీటిని తయారు చేయనున్నారు. భవిష్యత్తులో సైన్యం అవసరాల కోసం ఏకంగా 30,000 డ్రోన్లను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ డ్రోన్ ప్లాటూన్ల ఏర్పాటు, సైన్యం చేపడుతున్న విస్తృత ఆధునికీకరణలో ఒక భాగం మాత్రమే. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో వేగంగా స్పందించేందుకు 250 మంది సైనికులతో కూడిన 'భైరవ్ బెటాలియన్లను' కూడా సైన్యం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఐదు బెటాలియన్లు కార్యాచరణలోకి వచ్చాయి. అశ్ని, భైరవ్ యూనిట్ల కలయికతో భారత సైన్యం సరిహద్దుల్లో మరింత పటిష్టంగా మారుతోంది. ఈ మార్పులతో భారత సైన్యం సాంకేతికంగా శత్రువుపై స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించనుంది.

## హిందూ యువకుడు మతదూషణ చేయలేదు

హత్యపై వెలుగులోకి సంచలన విషయాలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఇటీవల మత విద్వేషం ముసుగులో జరిగిన హిందూ యువకుడి దారుణ హత్య ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ హత్యకు కారణమని చెబుతున్న 'మత దూషణ' ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని ప్రాథమిక విచారణలో తేలింది. డిసెంబర్ 18 రాత్రి మైమెన్‌సింగ్‌లో దీపు చంద్రదాస్ అనే హిందూ యువకుడిని ఒక ఉన్మాద మూక అత్యంత క్రూరంగా కొట్టి చంపింది. ఇస్లాం మతాన్ని కించపరిచాడంటూ తన ఫ్యాక్టరీలోని ఒక సహోద్యోగి చేసిన ఆరోపణలతో ఈ హింస మొదలైంది. ఆవేశంతో వచ్చిన మూక దీపును చంపి, మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసి నిప్పుపెట్టింది. ఈ ఘటనపై బంగ్లాదేశ్ పత్రిక 'ది డైలీ స్టార్'తో మాట్లాడిన రాబ్-14 కంపెనీ కమాండర్ మహ్మద్ సంసుజ్జమాన్ సంచలన విషయాలు వెల్లడించారు. దీపు చంద్రదాస్ తన సోషల్ మీడియాలో మతపరమైన భావాలను దెబ్బతీసేలా ఎలాంటి పోస్ట్‌లు చేయలేదని స్పష్టం చేశారు. "దీపు మతాన్ని విమర్శించడం మేము స్వయంగా విన్నాము" అని చెప్పే ఒక్క వ్యక్తి కూడా అక్కడ లేరని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీలో గొడవ జరుగుతున్నప్పుడు, ఫ్యాక్టరీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో అతడిని బలవంతంగా బయటకు నెట్టేశారని, ఆ తర్వాతే ఈ ఘోరం జరిగిందని అధికారి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇప్పటివరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వచ్చిన సమాచారంతో మరో ఐదుగురిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం 10 మందిని పోలీసులు విచారిస్తున్నట్లు ఏఎస్పీ మహ్మద్ అబ్దుల్లా అల్ మామున్ తెలిపారు. ఈ దారుణ హత్యపై ఉత్తర అమెరికా హిందూ కూటమి తీవ్రంగా స్పందించింది. "బంగ్లాదేశ్ ఆటవిక రాజ్యం వైపు వెళ్తోంది. హిందువులపై ఇంతటి హింస జరుగుతున్నా అంతర్జాతీయ మీడియా, ప్రపంచ దేశాలు మౌనంగా ఉండటం శోచనీయం" అని ఆ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది.

## సౌతాఫ్రికాలో కాల్పులు.. 9 మంది మృతి

జోహెన్నెస్ బర్గ్: సౌతాఫ్రికాలోని జోహెన్నెస్ బర్గ్ లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. జొహన్నెస్‌బర్గ్ శివారులోని ఓ టౌన్‌షిప్‌లో ఈరోజు ఉదయం ఓ బార్ ముందు దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న వారు తొమ్మిది మంది చనిపోయారు. మరో పది మందికి గాయాలయ్యాయి. దుండగులు రెండు కార్లలో అక్కడికి చేరుకుని అకస్మాత్తుగా కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. తొలుత ఈ ఘటనలో పదిమంది చనిపోయారని ప్రకటించారు. ఆ తర్వాత మృతులు తొమ్మిది మంది అని స్పష్టత ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నామని, అప్పటికే దుండగులు పారిపోయారని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించామన్నారు. కాల్పులు జరిగిన ఏరియా చుట్టుపక్కల బంగారు గనులు ఉన్నాయని, అక్కడ కార్మికులే ఎక్కువగా ఉంటారని పోలీసులు వివరించారు. కాగా, ఈ నెలలో దక్షిణాఫ్రికాలో ఇది రెండో సామూహిక కాల్పుల ఘటన. డిసెంబరు 6న ప్రిటోరియా సమీపంలో జరిగిన కాల్పుల్లో మూడేళ్ల చిన్నారిసహా 10 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

# 'వీబీ-జీ రామ్ జీ'కి రాష్ట్రపతి ఆమోదం

**ఎంజీఎన్ఆర్ఈజీఏ శకం సమాప్తం**

**గ్రామీణ ఉపాధి పనిదినాలు 125కి పెంపు**

**నిధుల భారం కేంద్రం, రాష్ట్రాలకు 60:40 నిష్పత్తిలో**





న్యూఢిల్లీ/హైదరాబాద్: దేశ గ్రామీణ ఉపాధి వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు-2025'కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం ఆమోదముద్ర వేశారు. 'వీబీ-జీ రామ్ జీ'గా పిలిచే ఈ బిల్లు, రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త చట్టం ప్రకారం గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి కల్పించే కనీస పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. 'వీబీ-జీ రామ్ జీ' చట్టం కింద గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం అవసరం లేని పనులకు ముందుకువచ్చే ప్రతి కుటుంబానికి సంవత్సరంలో కనీసం 125 రోజుల ఉపాధి కల్పన హామీ ఉంటుంది. ఈ చట్టంలో నిధుల కేటాయింపు విధానంలో ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. ఇప్పటివరకు ఉపాధి హామీ కూలీల వేతనాల భారాన్ని పూర్తిగా కేంద్రమే భరించేది. కానీ కొత్త చట్టం ప్రకారం ఇది కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో నడిచే పథకంగా మారింది. సాధారణ రాష్ట్రాల్లో కేంద్రం 60 శాతం నిధులు భరిస్తే, రాష్ట్రాలు 40 శాతం వాటా భరించాల్సి ఉంటుంది. ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు ఇది 90:10 నిష్పత్తిలో ఉండగా, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 100 శాతం నిధులను కేంద్రమే సమకూరుస్తుంది. వ్యవసాయ పనులకు కూలీల కొరత లేకుండా ఉండేందుకు, నాట్లు, కోతల సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు 60 రోజుల వరకు పనులను తాత్కాలికంగా నిలిపివేసే వెసులుబాటును కూడా కల్పించారు. ఈ బిల్లును పార్లమెంటులో డిసెంబర్ 18న విపక్షాల నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు ఇది ఒక నిరంకుశ చట్టం అని, గ్రామీణ పేదలకు అండగా నిలిచిన యూపీఏ హయాంలోని పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించాయి. చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపి, ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కూడా ఈ చట్టం పేదల హక్కులను కాలరాస్తుందని, అధికారాలను కేంద్రీకృతం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ మార్పులను సమర్థించారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పన, పారదర్శకత పెంచేందుకే ఈ కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. బయోమెట్రిక్ హాజరు, జియో-ట్యాగింగ్ వంటి సాంకేతికతతో పర్యవేక్షణ కట్టుదిట్టం అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వామ్యం చేస్తున్నామని పేర్కొంది.

# నా మాజీ ప్రియురాలు తిండిపోతు

**తిండి కోసమే రూ. 6.3 లక్షలు ఖర్చు చేశా**

**అవన్నీ ఇప్పించండి.. కోర్టుకు ఓ ప్రియుడు**

**భావోద్వేగ బంధానికి ప్రతీక అని కొట్టివేత**



బీజింగ్: చైనాలో ఓ యువకుడు తన మాజీ ప్రియురాలు, ఫియాన్సీని కోర్టుకీడ్చాడు. తనతో కలిసి ఉన్నప్పుడు ఆమె తిండి కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశానని, ఆ సొమ్మంతా తిరిగిప్పించాలని కోరాడు. ఈ మేరకు కోర్టులో దావా వేశాడు. విచారించిన కోర్టు.. రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలో పెట్టిన ఖర్చు, కొనిచ్చిన వస్తువులతో ఇరువురూ భావోద్వేగ బంధాన్ని కలిగి ఉంటారని గుర్తుచేస్తూ, ఆ సొమ్ము తిరిగివ్వమనడం సరికాదని పేర్కొంటూ పిటిషన్ కొట్టేసింది. అయితే, బ్రైడ్ ప్రైస్ కింద యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన సొమ్ములో సగం తిరిగివ్వాలని మాజీ ప్రియురాలిని కోర్టు ఆదేశించింది. ఈ వింత దావా వివరాల్లోకి వెళితే.. నార్త్ ఈస్టర్న్ చైనా హిలోంజియాంగ్ రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన యువకుడు 'హె' (ఇంటిపేరు), వాంగ్ అనే యువతితో మాట్రిమోని యాప్ లో పరిచయం ఏర్పడింది. ఆపై ఇరువురూ కొంతకాలం రిలేషన్ షిప్ లో ఉన్నారు. ఆ సమయంలో హె తల్లిదండ్రులకు చెందిన హోటల్ లో వాంగ్ పనిచేసింది. ఆ తర్వాత హె, వాంగ్ ఎంగేజ్ మెంట్ చేసుకున్నారు. ఆ సమయంలో సంప్రదాయం ప్రకారం హె తల్లిదండ్రులు బ్రైడ్ ప్రైస్ కింద 20 వేల యువాన్లు వాంగ్ కు ఇచ్చారు. ఆరు నెలలు కలిసి ఉన్నాక వాంగ్ తీరుతో విసిగిపోయిన హె పెళ్లి రద్దు చేసుకున్నాడు. వాంగ్ కు పనికన్నా తిండిపైనే ఎక్కువ శ్రద్ధ ఉండేదని, తరచూ షాపింగ్ చేస్తూ తన డబ్బుతో పలు దుస్తులు ఇతరత్రా వ్యక్తిగత వస్తువులను కొనుగోలు చేసిందని హె ఆరోపించాడు. ఇందుకు 30 వేల యువాన్లు ఖర్చయిందని, బ్రైడ్ ప్రైస్ గా ఇచ్చిన 20 వేల యువాన్లు కలిపి మొత్తం 50 వేల యువాన్లు (రూపాయల్లో దాదాపు 6.3 లక్షలు) తిరిగిప్పించాలని కోర్టులో దావా వేశాడు. అయితే, ప్రియురాలి కోసం పెట్టిన ఖర్చు పట్ల సెంటిమెంటలాగా విలువ ఉంటుందని, ఆ సొమ్మును తిరిగివ్వమనడం సరికాదని జడ్జి పేర్కొంటూ కేసు కొట్టివేశారు. అయితే, బ్రైడ్ ప్రైస్ గా ప్రియుడి కుటుంబం ఇచ్చిన 20 వేల యువాన్లలో సగం సొమ్ము తిరిగివ్వాలని ప్రియురాలిని ఆదేశించారు.

# మహారాష్ట్ర స్థానికంలో మహాయుతి హవా

**అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ**

**129 స్థానాలు కైవసం చేసుకున్న కమలం పార్టీ**

**ఇది మోదీ పాలనకు లభించిన ప్రజామోదం: షా**

ముంబై: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయదుందుభి మోగించింది. మొత్తం 288 నగర పరిషత్, పంచాయతీ స్థానాలకు వెలువడిన ఫలితాల్లో, బీజేపీ 129 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని మహాయుతి కూటమి ఈ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని, ఈ విజయమే అందుకు నిదర్శనం, ఇది ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, "ఈసారి ఎన్నికల్లో నేను ఏ నాయకుడిని, ఏ పార్టీని విమర్శించలేదు. కేవలం నా ప్రణాళికలను వివరించి 100 శాతం సానుకూల ప్రచారం చేశాను. ప్రజలు దానిని ఆమోదించారు" అని తెలిపారు. మరోవైపు, ప్రతిపక్ష కాంగ్రెస్, శివసేన (యూబీటీ) తమ ఓటమిని అంగీకరించాయి. మహాయుతి గెలుపునకు ఎన్నికల సంఘం సహకరించిందని ఆరోపించాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కల్... బీజేపీ మిత్రపక్ష నేతలైన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లకు హెచ్చరిక జారీ చేశారు. "బీజేపీ సాధించిన ఈ విజయం షిండే, అజిత్ పవార్లకు ఒక మేల్కొలుపు. బీజేపీ నూటికి నూరు శాతం ఈ ఇద్దరు మిత్రపక్ష నేతలను వదిలించుకుంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. దాదాపు దశాబ్దం తర్వాత జరిగిన ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు డిసెంబర్ 2, 20 తేదీల్లో పోలింగ్ జరగ్గా, నేడు ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఫలితాలు రాబోయే బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు ముందు మహాయుతి కూటమికి భారీ ఉత్సాహాన్ని ఇచ్చాయి.



## ఇంటికి తాళం వేసి నిప్పు.. చిన్నారి సజీవ దహనం

**బీఎన్‌పీ నేత బేలాల్ హొస్సేన్ నివాసంపై దుండగుల దాడి**

ఢాకా: బంగ్లాదేశ్‌లో అరాచకం హద్దులు దాటుతోంది. రాజకీయ కక్షల వల్ల ఒక పసి ప్రాణం బలవగా, ఒక కుటుంబం మొత్తం ప్రాణాపాయ స్థితిలో ఉంది. లక్ష్మీపూర్ సదర్ ఉపజిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన సంచలనం సృష్టిస్తోంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత, వ్యాపారవేత్త బేలాల్ హొస్సేన్ నివాసమే లక్ష్యంగా దుండగులు ఈ దాడికి పాల్పడ్డారు. శనివారం తెల్లవారుజామున అందరూ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘాతుకం జరిగింది. దుండగులు పథకం ప్రకారం ఇంటికి ఉన్న రెండు తలుపులకు బయట నుంచి తాళం వేశారు. అనంతరం ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీనివల్ల లోపల ఉన్న వారు బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. ఈ అగ్నిప్రమాదంలో బేలాల్ హొస్సేన్ ఏడేళ్ల కుమార్తె అయేషా అక్తర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైంది. బేలాల్‌తో పాటు ఆయన ఇద్దరు కుమార్తెలు సల్మా అక్తర్ (16), సమియా అక్తర్ (14)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి శరీరాలు 50-60 శాతం వరకు కాలిపోయాయి. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఢాకాలోని బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ ఇనిస్టిట్యూట్‌కు తరలించారు. బేలాల్ తల్లి హేజరా బేగం ఆ చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. "అర్ధరాత్రి కిటికీలోంచి చూస్తే నా కొడుకు ఇల్లు మంటల్లో ఉంది. కేకలు వేస్తూ పరుగెత్తాను, కానీ తలుపులకు బయట నుంచి తాళం వేసి ఉంది. నా కొడుకు ఎలాగోలా తలుపులు బద్దలుకొట్టి బయటపడ్డాడు. కోడలు తన నాలుగు నెలల పసికందును, ఆరేళ్ల కొడుకును రక్షించుకోగలిగింది. కానీ లోపల పడుకున్న మనవరాళ్లు మంటల్లో చిక్కుకుపోయారు" అని కన్నీరుమున్నీరయ్యారు. ఈ కేసులో నిందితులు ఎవరు? ఈ దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మీపూర్ మోడల్ థానా పోలీసులు తెలిపారు.

## నమ్మకమైన పాలనతోనే దేశాభివృద్ధి

**కేంద్రం మంత్రి నిర్మల సీతారామన్**

**కర్ణాటకలోని హంపిలో ఆర్థిక శాఖ 'చింతన్ శిబిర్'**

హంపి: భారతదేశాన్ని 'వికసిత భారత్'గా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలంటే సరళమైన చట్టాలు, నమ్మకంపై ఆధారపడిన పాలన చాలా కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వ్యాపార విధానాలను సులభతరం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారానే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. కర్ణాటకలోని విజయనగర జిల్లా హంపిలో ఆదివారం జరిగిన కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖల 'చింతన్ శిబిర్'లో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో రెండు మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, సీబీడీటీ, సీబీఐసీ చైర్మన్లు, ముఖ్య ఆర్థిక సలహాదారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్లిష్టమైన చట్టాలను సరళతరం చేయాలని, ప్రజలు, సంస్థలపై అనుమానంతో కాకుండా నమ్మకంతో కూడిన పాలన అందించాలని మంత్రి సూచించారు. పన్ను ఎగవేతలను గుర్తించడం, విధాన నిర్ణయాల్లో పారదర్శకత పెంచడం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కూడా ఈ శిబిర్‌లో చర్చించారు. విజయనగర సామ్రాజ్యం సాధించిన విజయాలను గుర్తుచేస్తూనే, ప్రస్తుత అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, దేశ ఆర్థిక ప్రగతికి అవసరమైన సంస్కరణలను వేగంగా అమలు చేయడమే ఈ చర్చల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## భూమి దిశగా స్టార్ లింక్ శాటిలైట్

న్యూయార్క్: ఎలాన్ మస్క్ కు చెందిన స్టార్ లింక్ ప్రాజెక్టు శాటిలైట్లలో ఒకటి అదుపుతప్పి భూమి దిశగా దూసుకొస్తోంది. ఆ శాటిలైట్ లోని ప్రొపల్షన్ ట్యాంకులో ఉన్న గ్యాస్ తీవ్ర వేగంతో బయటికొచ్చేసిందని, దాంతో ఆ శాటిలైట్ ఒక్కసారిగా 4 కిలోమీటర్ల కిందికి వచ్చేసిందని స్పేస్ ఎక్స్ సంస్థ వెల్లడించింది. డిసెంబరు 17 నాటికి భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ఉపగ్రహం... మరో వారం రోజుల్లో భూవాతావరణంలోకి ప్రవేశించి కూలిపోతుందని వివరించింది. అయితే, దీనివల్ల భూమికి ఎలాంటి ప్రమాదం లేదని, అదే సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి కూడా ఎలాంటి ముప్పు లేదని స్పేస్ ఎక్స్ స్పష్టం చేసింది. భూవాతావరణంలోకి ప్రవేశించగానే, ఆ శాటిలైట్ కాలిపోతుందని తెలిపింది. కాగా, కూలిపోతున్న స్టార్ లింక్ శాటిలైట్ శకలాలను వరల్డ్ వ్యూ-3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి ఫొటోలు తీసింది.

## ఆరెస్సెస్‌ను బీజేపీతో ముడిపెట్టొద్దు: మోహన్ భగవత్

కోల్‌కతా: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది వేడుకల సందర్భంగా కోల్ కతాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ గురించి చాలామందిలో అపోహలు ఉన్నాయని అన్నారు. ఆర్ఎస్ఎస్ ను బీజేపీతో ముడివేయడం పెద్ద తప్పు అని స్పష్టం చేశారు. బీజేపీలో అనేకమంది నాయకులు ఆర్ఎస్ఎస్ నుంచి వెళ్లినవాళ్లే అని, అంతమాత్రాన ఆర్ఎస్ఎస్ ను బీజేపీతో కలిపి చూడడం పొరపాటు అని అభిప్రాయపడ్డారు. సంఘ్ ఎవరి పట్ల విరోధభావంతో పనిచేయదని, హిందూ సమాజ ఐక్యత, సౌహార్దత కోసమే పనిచేస్తుందని మోహన్ భగవత్ స్పష్టం చేశారు. చాలామందికి ఆర్ఎస్ఎస్ అనే పేరు మాత్రమే తెలుసని, కానీ ఆర్ఎస్ఎస్ ఎలాంటి కార్యకలాపాలు నిర్వర్తిస్తుందో తెలియదని అన్నారు. సంఘ్ అభివృద్ధి చెందడం కొందరికి నచ్చని విషయం అని వ్యాఖ్యానించారు. కేవలం హిందూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే ఆర్ఎస్ఎస్ కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని భగవత్ ఉద్ఘాటించారు.

## బీఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే కాంగ్రెస్

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రమేశ్ చెన్నితల స్పష్టం చేశారు. కేవలం పోటీ చేయడమే కాకుండా, అధికార పక్ష వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన ప్రకటించారు. ముంబై నగర అభివృద్ధి, పాలనపై సమీక్షా సమావేశం అనంతరం చెన్నితల మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ముంబైలో జరిగిన అవినీతి, పాలనా వైఫల్యాలపై ఒక ప్రత్యేక 'చార్జ్‌షీట్' విడుదల చేయనున్నట్టు చెప్పారు. నగర అభివృద్ధి కోసం పార్టీ విజన్‌ను వివరిస్తూ త్వరలోనే మేనిఫెస్టోను ప్రజల ముందుకు తెస్తామని తెలిపారు. దేశ ఆర్థిక రాజధానిలో పెరిగిపోతున్న కాలుష్యం, అవినీతి, అరకొర అభివృద్ధి వంటి అంశాలే తమ ప్రధాన ప్రచార అస్త్రాలని ఆయన పేర్కొన్నారు. "ముంబై ఆశించిన స్థాయిలో ఎందుకు అభివృద్ధి చెందలేదు? దీనికి బాధ్యులెవరో ప్రజలకు తెలుసు" అని ఆయన ప్రశ్నించారు. వార్డుల విభజన, ఓబీసీ రిజర్వేషన్ల వంటి న్యాయపరమైన చిక్కుల వల్ల బీఎంసీ ఎన్నికలు చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో ఈ ఎన్నికల ప్రక్రియలో కదలిక వచ్చిందని చెన్నితల గుర్తుచేశారు. వంచిత బహుజన్ అఘాడి (వీబీఏ) తో పొత్తు ఉండవచ్చా? అన్న ప్రశ్నకు రమేశ్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఇప్పటికే తాను ఆ పార్టీ అధినేత ప్రకాశ్ అంబేద్కర్‌తో ఫోన్‌లో మాట్లాడానని, తమ ప్రతినిధి బృందం త్వరలో ఆయనను కలిసి చర్చలు జరుపుతుందని తెలిపారు. అయితే, ఈ చర్చల సారాంశంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం మహారాష్ట్రలో మున్సిపల్ కౌన్సిల్స్, నగర పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతోంది. ఈ ఫలితాలు రాబోయే బీఎంసీ వంటి భారీ కార్పొరేషన్ ఎన్నికలకు ఒక 'లిట్మస్ టెస్ట్' (దిక్సూచి) లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## వయ్యారి చిత్రం







## మా నాన్న కోరిక అదే: రోషన్

హీరో రోషన్ తన కెరీర్ గురించి, వ్యక్తిగత లక్ష్యాల గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను మొదట నటుడు కావాలనుకోలేదని, ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా స్థిరపడాలనేది తన తొలి కల అని ఆయన వెల్లడించారు. తన తండ్రి కోరిక కూడా అదేనని, అయితే సినిమాలపై ఉన్న ఆసక్తి తనను నటన వైపు నడిపించిందని తెలిపారు. ప్రస్తుతం ఆయన 'ఛాంపియన్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా అవకాశం గురించి రోషన్ మాట్లాడుతూ, "నిర్మాత దత్తు గారు ఎంతోమందిని ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. అలాంటి నిర్మాత నాకు ఇంత గ్రాండ్‌గా 'ఛాంపియన్' సినిమా ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. స్వప్న అక్క, ప్రియాంక అక్క, దత్తు గారు అందరూ నన్ను ఒక కుటుంబ సభ్యుడిలా చూసుకుంటారు" అని అన్నారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి వివరిస్తూ, "ఇకపై కెరీర్‌లో ఎక్కువ విరామం తీసుకోవాలనుకోవడం లేదు. కనీసం రెండేళ్లకు మూడు సినిమాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను" అని రోషన్ స్పష్టం చేశారు. తన తండ్రి కోరిక మేరకు క్రికెటర్‌గా మారాలనుకున్నప్పటికీ, చివరికి నటననే తన మార్గంగా ఎంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, స్వప్న సినిమాస్ బ్యానర్‌పై ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రోషన్ నటించిన తాజా చిత్రం ఛాంపియన్ ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించారు.



### ది రాజాసాబ్ ఓటీటీ డీల్

## తక్కువే: నిర్మాత

కమర్షియల్ డైరెక్టర్ మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో 'ది రాజాసాబ్' అనే భారీ పాన్ ఇండియా సినిమాని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ అభిమానులు ఈ సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఈ చిత్ర నిర్మాత టి.జి. విశ్వ ప్రసాద్.. ఈ సినిమా ఓటీటీ డీల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా ఓటీటీ డీల్ పూర్తయిందని ఆయన చెప్పారు, అయితే, ఊహించిన దానికంటే తక్కువ మొత్తానికే ఈ సినిమా ఓటీటీ రైట్స్ అమ్ముడుపోయ్యాయని ఆయన నిజాయితీగా చెప్పడంతో.. ఆయన కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఇక ఓటీటీ డీల్ ఊహించిన దానికంటే తక్కువ వచ్చినా, సినిమా బాక్సాఫీస్ దగ్గర అద్భుత విజయం సాధిస్తుందని అని ఆయన తెలిపారు. కాగా రొమాంటిక్ కామెడీ హారర్ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ కూడా సందడి చేయనున్నారు. ఈ సినిమా జనవరి 9న రిలీజ్ కాబోతుంది. అన్నట్టు ప్రభాస్ తో పాటు, ఈ సినిమాలో సంజయ్ దత్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతుంది.




## 26న ఓటీటీలోకి 'రివాల్వర్ రీటా'

కీర్తి సురేష్ టైటిల్ రోల్ లో నటించిన సినిమా 'రివాల్వర్ రీటా'. జే.కే చంద్రు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. ఇప్పుడు ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి రాబోతోంది. డిసెంబర్ 26, 2025 నుండి ఈ చిత్రం ఆ ప్లాట్‌ఫామ్‌లో ప్రసారం కానుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తమిళ మరియు తెలుగు వెర్షన్లతో పాటు, మలయాళం మరియు కన్నడ వెర్షన్లు కూడా అందుబాటులో రానున్నాయి. కాగా ఈ సినిమాలో రాధిక శరత్ కుమార్, రెడిన్ కింగ్స్లీ కీలక పాత్రలు పోషించారు. 'రివాల్వర్ రీటా' చిత్రాన్ని ప్యాషన్ స్టూడియోస్ %ఌ% ది రూట్ బ్యానర్స్ పై సుధన్ సుందరం (మహారాజ నిర్మాత), జగదీష్ పళనిస్వామి సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీ ఏపీ, తెలంగాణ థియేట్రికల్ హక్కులని హాస్య మూవీస్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా దక్కించుకుని రిలీజ్ చేశారు. మరి కీర్తి సురేష్ సినిమా ఓటీటీలో ఎలాంటి సక్సెస్ ను అందుకుంటుందో చూడాలి.





### వారణాసికి

## 1,300 కోట్ల బడ్జెట్

దర్శకధీరుడు రాజమౌళి-మహేష్ బాబు సినిమా 'వారణాసి'ని హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఇదిలా ఉండగా, ఇటీవల 'ది కపిల్ శర్మ షో ఎస్4'లో కనిపించిన ప్రియాంక, వారణాసి గురించి ఇంతకు ముందు అధికారికంగా వెల్లడించని ఒక కీలకమైన విషయాన్ని చెప్పింది. వారణాసి చిత్రాన్ని రూ. 1,300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఇది టాలీవుడ్ చిత్రాలలో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్ కాగా, రాజమౌళి కెరీర్‌లో కూడా ఇదే అతిపెద్ద ప్రాజెక్ట్. ప్రస్తుతం ఈ చిత్రం అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతున్న భారతీయ చిత్రాలలో రెండవ స్థానంలో ఉంది, అయితే, నితీష్ తివారీ 'రామాయణం పార్ట్ 1' రూ. 2,000 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతున్నట్లు చెబుతున్నారు.



## తాగి ఢీకొట్టాడు

### నోరా ఫతేహీ

బాలీవుడ్ నటి నోరా ఫతేహి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఐతే, తాను ప్రస్తుతం క్షేమంగా ఉన్నానని నోరా ఫతేహి క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేస్తూ.. 'డ్రింక్ చేసిన ఓ కారు డ్రైవర్ నా కార్ ను ఢీ కొట్టాడు. దీంతో, నా తల, కారు విండోకు బలంగా తలిగింది. ఆ సమయంలో ఏం జరిగిందో నాకు అర్థం కాలేదు. అయితే, ప్రస్తుతానికి నేను బాగానే ఉన్నాను. కాకపోతే, తల వాపు ఉంది. ఇంకా కొన్ని గాయాలు మానలేదు' అని నోరా ఫతేహి తెలిపారు. నోరా ఫతేహి ఇంకా మాట్లాడుతూ.. ఆ ప్రమాదాన్ని భయానక ఘటనగా అభివర్ణించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ప్రోత్సహించొద్దని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. మద్యం మత్తులో డ్రైవింగ్‌తో ఎంతోమంది అమాయక ప్రజలు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని నోరా ఫతేహి ఎమోషనల్ అయ్యారు. నోరా ఫతేహి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నట్లు ముంబయి పోలీసులు తెలిపారు.

## రూమర్స్ వచ్చినా సపోర్ట్ చేశారు

కమల్ హాసన్ కుమార్తెగా సినీ లోకానికి పరిచయమైంది శ్రుతి హాసన్. ఐతే, శ్రుతి హాసన్ కి గతంలో కొన్ని ప్రేమ కథలు ఉన్నాయి. ఆమె కొందరితో ప్రేమలో పడింది. తన లవ్‌స్టోరీలు ఇతరులకు సిల్లీగా అనిపించొచ్చని, కానీ తనకు అలా కాదని ఆ మధ్య ఓపెన్ గా కూడా చెప్పుకొచ్చింది. ఐతే, శ్రుతి హాసన్ తన తండ్రి కమల్ హాసన్ తనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని తెలిపింది. ఈ విషయం పై ఇంతకీ, శ్రుతి హాసన్ ఏం మాట్లాడింది అంటే..'నాన్న నాకు ఏ విషయంలోనూ అడ్డు చెప్పలేదు. కానీ దాని వల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు' అని ఆమె తెలిపింది. శ్రుతి హాసన్ ఇంకా మాట్లాడుతూ.. 'నా పై ఎన్నో రూమర్స్ వినిపించాయి. వాటిల్లో అబద్దాలు ఉండొచ్చు, నిజాలు ఉండొచ్చు. కానీ, నాన్న మాత్రం నాకు ఎప్పుడూ సపోర్ట్ గా ఉన్నారు. ఇక నాకు తెలుసు, ఎంతోమందిలో మా నాన్న స్ఫూర్తిని నింపారు. అందుకే మా నాన్న అంటే నాకు ఎప్పటికీ అభిమానమే' అని ఆమె చెప్పుకొచ్చింది. కమల్ హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది శ్రుతి హాసన్. తాను సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, సొంతంగా ఈ స్థాయికి వచ్చాను' అంటూ శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది.




# ఆసియా కప్ విజేత పాక్

## ఫైనల్లో భారత్ ఘోర పరాజయం.. 191 పరుగుల తేడాతో ఓడిన భారత్

### 50 ఓవర్లలో 347 రన్స్ చేసిన పాక్.. లక్ష్యఛేదనలో 156 పరుగులకే టీమిండియా ఆలౌట్

టైటిల్ ఫేవరెట్ గా బరిలో దిగిన భారత కుర్రాళ్లకు అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో నేడు జరిగిన ఫైనల్లో భారత్ 191 పరుగుల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. అన్ని రంగాల్లో ఆధిపత్యం కనబర్చిన పాక్ జట్టు టైటిల్ ను చేజిక్కించుకుంది. దుబాయ్ లోని ఐసీసీ అకాడమీ స్టేడియంలో జరిగి ఈ మ్యాచ్ లో భారత్ తొలుత టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన పాక్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 347 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ సమీర్ మిన్హాస్ 172 పరుగులతో అద్భుత శతకం చేశాడు. అనంతరం 348 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ దారుణంగా విఫలమైంది. స్టార్ బ్యాటర్లు ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. దాంతో 26.2 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్ లో బౌలర్ దీపేశ్ దేవేంద్రన్ 36 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. వైభవ్ సూర్య వంశీ 26, కెప్టెన్ ఆయుష్ మాత్రే 2, ఆరోన్ జార్జ్ 16, విహాన్ మల్హోత్రా 7, వేదాంత్ త్రివేది 9, అభిజ్ఞాన్ కుందు 13, కనిష్క్ చౌహాన్ 9, ఖిలన్ పటేల్ 19, హెనిల్ పటేల్ 6, కిషన్ సింగ్ 3 పరుగులు చేశారు.




## పాక్ బౌలర్ల పంజా

పాకిస్థాన్ బౌలర్లలో అలీ రెజా 3 వికెట్లతో భారత వెన్నెముకను విరిచాడు. మహమ్మద్ సయ్యమ్, అబ్దుల్ సుభాన్, హుజైఫా ఎహ్సాన్ తలో రెండు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశారు. గ్రూప్ దశలో భారత్ చేతిలో ఎదురైన పరాజయానికి పాక్ జట్టు ఫైనల్‌లో సరైన బదులు తీర్చుకుంది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న టీమిండియా ఫైనల్‌లో ఒత్తిడికి లోనై పరాజయం పాలైంది. పాకిస్థాన్ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్‌ను ఎగురవేసుకుపోయింది.

## కొంపముంచిన ఆయుష్ మాత్రే

ఈ ఓటమికి భారత బ్యాటర్ల వైఫల్యం ఒక కారణమైతే.. అంతకంటే ముందు కెప్టెన్ ఆయుష్ మాత్రే తీసుకున్న ఓ తప్పుడు నిర్ణయం జట్టు విజయావకాశాలను దెబ్బతీసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా ఫైనల్ వంటి ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లలో టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్ చేసి భారీ స్కోరు బోర్డుపై ఉంచాలని భావిస్తుంది. తద్వారా ప్రత్యర్థిపై మానసిక ఒత్తిడి పెంచవచ్చు. కానీ భారత కెప్టెన్ ఆయుష్ మాత్రే దీనికి భిన్నంగా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దుబాయ్ మైదానంలో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. ఆయుష్ మాత్రే నిర్ణయాన్ని తప్పు అని నిరూపిస్తూ 347 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఆ భారీ స్కోరు భారత్‌ను మానసిక ఒత్తిడిలోకి నెట్టింది. పాక్ కెప్టెన్ కూడా టాస్ సమయంలో తాము మొదట బ్యాటింగ్ చేయాలనుకున్నామని చెప్పడం.. ఆయుష్ వ్యూహం ఎంత తప్పో స్పష్టం చేసింది.




## తాటాకు కోటలా కూలిన బ్యాటింగ్ లైనప్

348 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత బ్యాటర్లు ఏమాత్రం పోరాటపటిమ చూపలేకపోయారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే కేవలం 2 పరుగులు చేసి ఔట్ అవ్వడం ద్వారా జట్టును మరింత కష్టాల్లోకి నెట్టాడు. వైభవ్ సూర్యవంశీ (26) మెరుపు ఆరంభాన్ని ఇచ్చినా, ఆరోన్ జార్జ్ (16), వేదాంత్ (9), విహాన్ (7) వంటి కీలక బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. జట్టులో ఆరుగురు బ్యాటర్లు కనీసం రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆశ్చర్యకరంగా, బౌలర్ దీపేష్ (36) భారత్ తరపున అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. భారీ లక్ష్యాన్ని చూసి భయపడ్డ భారత కుర్రాళ్లు కేవలం 156 పరుగులకే ఆలౌట్ అయ్యారు. గ్రూప్ దశలో పాకిస్థాన్‌ను ఓడించిన భారత్, ఫైనల్‌లో మాత్రం ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోయింది. ఆయుష్ మాత్రే బౌలింగ్ నిర్ణయం తీసుకోకుండా మొదట బ్యాటింగ్ చేసి ఉంటే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేదని అభిమానులు సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# జెమీమా హాఫ్ సెంచరీ

## తొలి టీ20లో భారత్ విజయం



మహిళల ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా వైజాగ్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. రోడ్రిగ్స్ (69 నాటౌట్) అర్ధశతకంతో చెలరేగింది. స్మృతి మంధాన (25), హర్మన్ ప్రీత్‌కౌర్ (15 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ప్రారంభంలోనే చేదు అనుభవం ఎదురైంది. రెండో ఓవర్ రెండో బంతికే ఓపెనర్ షెఫాలీ వర్మ (9) రాంగ్ షాట్ ఆడి.. గిమ్హానీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. జట్టు స్కోరు 67 పరుగుల వద్ద మరో ఓపెనర్ స్మృతి మంధాన.. నీలాక్షి చేతికి చిక్కి పెవిలియన్‌కు చేరింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రోడ్రిగ్స్, హర్మన్ ప్రీత్ క్రీజులో నిలదొక్కుకొని బౌండరీలు బాదుతూ పరుగులు రాబట్టారు. దీంతో మరో 32 బంతులు మిగిలుండగానే టీమ్‌ఇండియా విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

### స్మృతి మందాన 4 వేల పరుగులు

స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన భారీ రికార్డు సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో 4,000 పరుగుల మైలురాయి అందుకున్న తొలి భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కింది. స్మృతి ఇప్పటివరకు ఈ మ్యాచ్‌కు ముందు 153 మ్యాచ్‌లు ఆడి 3,982 రన్స్ చేసింది. న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ సుజీ బేట్స్ మాత్రమే ఇప్పటివరకు అంతర్జాతీయ టీ20ల్లో 4 వేల పరుగులు చేసింది. తాజాగా, స్మృతి మందాన 4 వేల పరుగుల మైలురాయిని దాటింది.

# 148 ఏళ్ల రికార్డు బ్రేక్

## కివీస్ ఓపెనర్ల ప్రపంచ రికార్డు.. రెండు ఇన్నింగ్స్‌లో ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు




టెస్ట్ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ ఓ అరుదైన ప్రపంచ రికార్డుకు వేదికైంది. కివీస్ ఓపెనర్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే ఆశ్చర్యకరమైన రీతిలో ఆడి 1877లో టెస్ట్ క్రికెట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఓపెనింగ్ జోడీకి సాధ్యం కాని ఘనతను సాధించారు. సాధారణంగా ఓ టెస్ట్ మ్యాచ్‌లోని రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఓ బ్యాటర్ సెంచరీలు చేయడం మనం చూస్తుంటాం. కానీ ఒకే జట్టుకు చెందిన ఇద్దరు ఓపెనర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు బాదడం ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. మొదటి ఇన్నింగ్స్‌లో టామ్ లాథమ్ 137 పరుగులు, డెవాన్ కాన్వే 227 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ వీరిద్దరూ అదే జోరును కొనసాగించారు. రెండో ఇన్నింగ్స్‌లో టామ్ లాథమ్ 101 పరుగులు, డెవాన్ కాన్వే 100 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. ఈ అద్భుత ఫీట్‌తో 148 ఏళ్ల టెస్ట్ చరిత్రలో ముందెన్నడూ లేని రికార్డును వీరు సొంతం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో ముఖ్యంగా డెవాన్ కాన్వే విధ్వంసాన్ని సృష్టించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ(227), రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ(100) బాదడం ద్వారా ఒకే టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన తొలి న్యూజిలాండ్ బ్యాటర్‌గా డెవాన్ కాన్వే చరిత్ర సృష్టించాడు. డెవాన్ కాన్వే అద్భుతమైన ఫామ్ వెస్టిండీస్ బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేసింది. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ డెవాన్ కాన్వే రికార్డుల సునామీ సృష్టించాడు. కేవలం వ్యక్తిగత రికార్డులే కాకుండా, భాగస్వామ్యంలోనూ ఈ జోడీ భారత్‌కు చెందిన రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన జోడీగా లాథమ్-కాన్వే నిలిచారు. తొలి ఇన్నింగ్స్‌లో వీరిద్దరూ మొదటి వికెట్‌కు 323 పరుగులు జోడించారు. గతంలో రోహిత్-మయాంక్ జోడీ దక్షిణాఫ్రికాపై నెలకొల్పిన 317 పరుగుల రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. ఒకే టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేసిన న్యూజిలాండ్ దిగ్గజాల జాబితాలో ఇప్పుడు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే చేరిపోయారు. గతంలో జీఎంటర్నర్ (1974), కేన్ విలియమ్సన్ (2024) వంటి దిగ్గజాలు మాత్రమే ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు ఒకే మ్యాచ్‌లో ఇద్దరు ఓపెనర్లు ఈ ఫీట్ సాధించడం కివీస్ క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

# సూర్య.. జస్ట్ మిస్

### కెప్టెన్ కాకపోయుంటే వేటే




వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచ కప్ 2026 కోసం టీమిండియా ఎంపిక అనేక చర్చలకు దారితీస్తోంది. ఫామ్ సమస్యతో స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌పై వేటు పడగా.. దాదాపు అదే స్థాయిలో విఫలమవుతున్న సూర్యకుమార్ యాదవ్ మాత్రం జట్టులో చోటు దక్కించుకున్నారు. అయితే దీని వెనుక సూర్య బ్యాటింగ్ ప్రతిభ కంటే అతని కెప్టెన్సీ ప్రధాన కారణమని క్రికెట్ విశ్లేషకులు చెప్తున్నారు. సెలెక్టర్లు శుభ్‌మన్ గిల్‌ను పక్కన పెట్టడానికి కారణం అతడి పేలవమైన స్ట్రైక్ రేట్ అని చెప్పారు. కానీ ఓ సారి గణాంకాలను పరిశీలిస్తే సూర్యకుమార్ యాదవ్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. శుభ్‌మన్ గిల్ గత 15 ఇన్నింగ్స్‌ల్లో 137.26 స్ట్రైక్‌రేట్‌తో 291 పరుగులు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ ఈ ఏడాది ఆడిన 19 ఇన్నింగ్స్‌ల్లో 123.2 స్ట్రైక్ రేట్‌తో కేవలం 218 పరుగులు మాత్రమే చేశాడు. ఇది సూర్య కెరీర్‌లోనే అత్యంత దారుణమైన ప్రదర్శన కావడం గమనార్హం. ఓ నివేదిక ప్రకారం.. కేవలం జట్టుకు కెప్టెన్ అనే ఒకే ఒక్క కారణంతో సూర్యకుమార్ యాదవ్ జట్టులో కొనసాగుతున్నారు.

# కంగారుల హ్యాట్రిక్

## చావోరేవో మ్యాచ్‌లో ఇంగ్లండ్ బోల్తా.. సిరీస్ పట్టేసిన ఆస్ట్రేలియా




**యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా హ్యాట్రిక్ కొట్టింది. పెర్త్, బ్రిస్బేన్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చిన ఆసీస్ అడిలైడ్‌లోనూ పంజా విసిరింది. మిచెల్ స్టార్క్(3-62), నాథన్ లియాన్(3-77) విజృంభించడంతో చావోరేవో మ్యాచ్‌లో పర్యాటక జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు.**

**ఐదోరోజు జేమీ స్మిత్(60), విల్ జాక్స్ (47)లు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని ఔట్ చేసి ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. అడిలైడ్‌లో 82 పరుగుల తేడాతో గెలుపొందిన కంగారూ టీమ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో పట్టేసింది. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ పోరాడలేక ట్రోఫీ సమర్పించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్ల జోరుకు ప్రధాన బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోవడంతో 82 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.**

ఓవర్‌నైట్ స్కోర్ 2076 తో ఐదో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌ను మిచెల్ స్టార్క్(3-62) దెబ్బకొట్టాడు. అర్ధ శతకంతో రాణించిన జేమీ స్మిత్(60)ను, విల్ జాక్స్(47)ను ఔట్ చేసి పర్యాటక జట్టును ఓటమి ఖాయం చేశాడు. దాంతో, తొలి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో సిరీస్ సమర్పించుకుంది. ఆసీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో ఓపెనర్ జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3-24), నాథన్ లియాన్(3-64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో వికెట్ కాపాడుకున్న జేమీ స్మిత్, విల్ జాక్స్ ఐదోరోజు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని పెవిలియన్ పంపి ఇంగ్లండ్ యాషెస్ కలను భగ్నం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో మెరిసిన అలెక్స్ క్యారీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# మంత్రతంత్రాలు.. భూతలిపి

ఒక విచిత్రమైన భాష .. బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాని భాష, విచిత్రమైన బొమ్మల మధ్య, చిత్రమైన అక్షరాలు.. విడ్డూరమైన ఆకారాలు.. దేంతో రాశారో తెలియదు. ఎవరు రాశారో తెలియదు.. కానీ వాటిని చూస్తేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది.. దాని వెనుక ఏదో తెలియని గుబులు పుడుతుంది.. ఏమిటిదన్న ఆందోళన నెమ్మదిగా మొదలవుతుంది. మిగతా ప్రపంచానికి ఇదేమిటన్నది తెలియదు.. స్థానిక ప్రజలు మాత్రం దీన్ని భూతాల భాష అంటారు.. అవును.. ఇది భూతాలు రాసుకున్న భాష.. భూతాలు ఏర్పరుచుకున్న ‘ లిపి.. భూత లిపి.. ఇవి నరమానవులకు అర్థం కాని భూతాక్షరాలు.. మరణాన్ని శాసించే రక్తాక్షరాలు.. అవును ఇది దెయ్యాల భాష..ఘోష. వాటి మధ్య కమ్యునికేషన్ కోసం ఏర్పాటు చేసుకున్న పర్ఫెక్ట్ వకాబులలీ. ఇవి.. భూతాలు రాసుకున్న పురాణాలు.. అవి తీర్చిదిద్దుకున్న మంత్ర తంత్రాలు.. అవి పలికితే.. అంతే సంగతులు.. అవి చదివితే... అంతులేని రక్తచరిత్ర.. మానవుడు శ్వాస కూడా తీసుకోలేడు!



ఈ లిపిని చూస్తే.. అనేక అనుమానాలు కలుగుతాయి.. అంతకు మించిన ఆందోళన రేగుతుంది. ఏమిటో అర్థం కాదు.. భూతాలకు, జీవకోటికి మధ్య యుద్ధం జరుగుతోందా? ఎందుకోసం ఈ పోరాటం? ఎవరు రగిల్చారు ఈ చిచ్చు? ఈ అక్షరాలు చెప్తున్నదేమిటి? వీటిలోని రహస్య సంకేతాలేమిటి? మన డెతేట్ను భూతాలు డిసైడ్ చేస్తున్నాయా? కాలజ్ఞానాన్ని భూతజ్ఞానం శాసిస్తున్నదా? హఠయోగానికి తప్ప అంతుపట్టని రహస్యం ఇది. ఇది భూతాలకు సంబంధించిన భాష.. పిశాచాలకు మాత్రమే అర్థమయ్యే భాషగా హఠయోగులు చెప్పుకుంటారు. కిరాటులు.. కిన్నెరులకు మాత్రమే తెలిసిన భాష అని అంటారు. నిజంగా ఇది ప్రపంచంలో ఎవరూ చదవలేని రహస్యమయ భాష.. దీనిపై వున్న బొమ్మలు భయం కొల్పేలా ఉంటాయి. వీటిని ఎవరు రాశారో తెలియదు. రాసిన దానికి అర్థం ఏమిటి? ఇది నిజంగా భూతాల భాషేనా? చూస్తేనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న ఈ లిపి వెనుక ఉన్న రహస్యం ఏమిటి? అంటే అంత తేలిగ్గా వంటబట్టే అంశం కాదు. హిమాలయాల్లో అనేక రహస్యాలు దాగి ఉన్న పంజయ్ గ్రామ శివారుల్లోని పర్వత ప్రాంతంలో ఈ లిపి కనిపిస్తోంది. శవాలను పీక్కుతినే రాబందులకు ఇది డైనింగ్ స్పాట్ అన్నంత భయంకరంగా ఉండే చోటు అది. భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, జీవాత్మలు తిరిగే చోటుగా ప్రజలు భయపడుతుంటారు. కొండకు అటు పక్కనున్న భూతానికి ఇటు పక్కనున్న భూతం ఉత్తరాలు రాస్తుందని.. అది రాతిపై లిపిలా ఉంటుందని అమాయకులు నమ్ముతుంటారు... దెయ్యాల మధ్య మంచి చెడులు చర్చ జరుగుతుందన్నంత నమ్మకాలూ షికార్లు చేస్తుంటాయి. వాటికీ ఓ లాంగ్వేజి ఉందంటారు.. వర్ణమాల కూడా ఉందంటారు.

చైనీయులకు మాదిరిగా చిత్రలిపి ఉందంటారు. వీళ్ల మాటల్లో సంకేతాక్షరాలు కూడా వున్నాయి. తెలుగు వారికి తమిళం అర్థం కానట్టే.. తమిళం వారికి బెంగాలీ అర్థం కానట్టే.. భూతాల భాష మనుషులకూ అర్థం కాదు. కొందరికి మాత్రం అర్థమవుతాయి. ఈ లిపిని ఎవరు సృష్టించారు? అంటే భూతగణాధిపతి త్రినేత్రం నుంచి పుట్టిన భాష ఇదని చెప్తారు. ఈ ధ్వనులన్నీ.. శివుడి రుద్రతాండవం నుంచి ఉద్భవించిన ధ్వనులు.. భూతలిపిలో రాసిన మంత్రాలను పైన పొందుపరచిన చిత్రంలో చూడవచ్చు. జాగ్రత్తగా గమనించండి.

ఈ భూత్ పి కొద్ది కొద్దిగా దేవనాగరి లిపికి దగ్గరగా ఉంది. సంస్కృత భాష మాదిరిగా కనిపిస్తుంది. కానీ, ఇది దేవనాగరి లిపి కానీ, సంస్కృత భాష కానీ కానే కాదు. ఇది అన్నింటికీ భిన్నమైన భాష.. దీన్ని అర్థం చేసుకునే కొందరి అభిప్రాయం ప్రకారం ఇది సంస్కృతం కంటే చాలా పురాతనమైన భాష. సంస్కృతం పరిశుద్ధమైన భాష.. ఈ భూతలిపికి ఎలాంటి వ్యాకరణం ఉన్నట్లు కనిపించదు. కొన్ని శబ్దాలకు అర్థాలే కనపడవు. మరి ఇది ఎలాంటి భాష.. ఎప్పటి భాష? నిజంగా భూతాలు, ప్రేతాల భాషేనా? లేక ఏదైనా కిరాట జాతికి సంబంధించిన భాషనా? అంటే జవాబులు దొరకవు. మామూలుగా అయితే మనం భూత వైద్యుల గురించి విన్నాం.. వారిని కన్నాం.. వీళ్లందరూ గ్రామాల్లో అమాయకులను మోసం చేసి సొమ్ములు చేసుకునే వారు. అలాగే భూత విద్య, భూతలిపి అభూత కల్పనలనీ, మూఢ నమ్మకాలనీ మనం ఇంతకాలంగా విశ్వసిస్తూ వస్తున్నాం. కానీ, భూత విద్య అన్నది నిజంగానే ఉన్నదని, దానికి ఓ లాంగ్వేజీ కూడా ఉన్నదని అది నేర్చుకోవటానికి, అర్థం చేసుకోవటానికి చాలా తంతే ఉంటుందని తాంత్రికులమని చెప్పుకునే వాళ్లు వాదిస్తున్నారు. భూత ప్రేతాలను నమ్మటమే లేనప్పుడు, వాటికో లిపి ఉన్నదంటే మాత్రం ఎలా నమ్మేది అంటే.. దేవుణ్ణి నమ్మినప్పుడు భూత, ప్రేతాలను కూడా నమ్మాలి మరి.

హిమాచల్ ప్రదేశ్లోని పంజయ్ గ్రామ పరిసరాల్లో హిమాలయ పర్వత శ్రేణుల్లో కొన్ని బండరాళ్లపై చిత్రవిచిత్రమైన అక్షరాలు, బొమ్మల రూపంలో వున్న సంకేతాలను భూతలిపి అంటున్నారు. ఇక్కడ వామాచార పద్ధతుల్లో తాంత్రికోపాసన చేస్తున్న కొందరు యోగులకు ఈ లిపి లభించింది. దీనిపై వాళ్లు పరిశోధనలు ప్రారంభించారు. వీళ్ల కథనం ప్రకారం పరమేశ్వరుడు హిమాలయాలను సృష్టించి తాను అక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకున్నప్పుడు.. తనతో పాటుగా యక్ష, రాక్షస, గంధర్వ, కిన్నెర, కిరాట, కింపురుషులకు రకరకాల ప్రదేశాల్లో చోటు కల్పించాడట.. వాళ్ల కోసం ప్రత్యేక భాషను సృష్టించి రాక్షస గురువు శుక్రాచార్యుడికి ఇచ్చాడట భూతనాథుడు. అప్పటి నుంచి భూత, పిశాచ గణాల మధ్య కమ్యునికేషన్ భూతభాషలో మొదలైందని ప్రచారంలో ఉన్న కథనం. కులు నుంచి పంజయ్ వరకు రకరకాల గ్రామాల్లో భూతలిపి ఉన్న శిలాశాసనాలు మనకు కనిపిస్తాయి. ఇవి మామూలు మనుషులకు అర్థం కావు.. భూతవిద్య తెలిసిన వాళ్లు మాత్రం ఈ మంత్రాలను చదవటం ద్వారా వాటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ దగ్గరకు రప్పించుకుంటారంటారు. ఈ అక్షరాలను అర్థం చేసుకోవటం సంగతి దేవుడెరుగు.. కనీసం వీటి ధ్వనులను విని కూడా అవగాహన చేసుకోవటం సాధ్యం కాదు.. భూత విద్య తెలిసిన వాళ్లు ఈ లిపిని డీకోడ్ చేశామని చెప్తున్నారు. వాళ్ల కథనం ప్రకారం, దేవనాగరిలో ఉన్నట్లే, భూతలిపిలో మొత్తం 54 అక్షరాలు ఉన్నాయిట.

వీటిని బీజాక్షరాలని వాళ్లు పిలుస్తారు.. వీటి ఉచ్చారణ మామూలు మనుషులు మాట్లాడే రీతికి పూర్తి భిన్నంగా ఉంటుంది. వీటికి ఓ సౌండ్ ఉంటుంది. రిథమ్ ఉంటుంది. ఆ టోన్లో.. ఆ రిథమ్లో.. ఆ ట్యూన్లో పలికితేనే ఆ భాష అర్థమవుతుందన్నది ఈ యోగుల బలమైన భావన. ఈ యోగుల అభిప్రాయం ప్రకారం భూతలిపిని తెలుసుకోవటం వల్ల తంత్రం అంటే ఏమిటో తెలుస్తుంది. తంత్ర విద్యను తెలుసుకోవచ్చు. తంత్ర యోగాన్ని సాధించవచ్చు. దీనికోసం ప్రత్యేక గ్రంథం అంటూ ఏదీ లేదు. గురుశిష్యపరంపర ద్వారా తెలుసుకున్నది, అధ్యయనం చేసింది మాత్రమే బతికి ఉన్నది. నిజానికి ఇది భూతాలు, ప్రేతాలు రాసుకునే లిపి కాదు.. ఇది ఒక రకమైన తంత్ర సాధనకు సంబంధించిన లిపి.. వామాచార పద్ధతిలో ఉపాసకులు కఠినంగా హఠయోగం చేసేందుకు ఉపయోగించే మంత్రాలు. దీని ఉపాసన చాలా తీవ్రంగా ఉంటుంది. మామూలు పరిస్థితిలో చదవగలిగే మంత్రాలు కావివి. అంత తేలిగ్గా పట్టుబడేవి కావు కూడా.. వీటిని తప్పుగా ఉచ్చరించినా.. దాని నెగెటివ్ వైబ్రేషన్స్ తీవ్రంగానే ప్రభావం చూపుతాయి. ఒక పద్ధతిలో, నిష్టతో ముందుకు సాధన చేస్తే తప్ప లొంగని మంత్రాలివి. రుద్రుడు.. అంటే శివుడి మరో రూపం.. ఈ రుద్రుడి ఉపాసనతో పాటు భైరవి ఉపాసన కూడా ఉంటుంది. కాళి, తార, ఛిన్నమస్త, ధూమవతి, భగళముఖి ఉపాసనలు వామాచార పద్ధతిలో ప్రత్యేకంగా ఉంటాయి. ఈ పద్ధతుల్లో తంత్ర సాధన, యోగ సాధన విపరీతంగా ఉంటాయి. వాటిలో మంత్రాలు, దానికి సంబంధించిన లిపి, చిత్రాలు కూడా అంతే విపరీతంగా కనిపిస్తాయి. యోగ, తంత్ర సిద్ధి కోసం ఈ రహస్యమయ మంత్రాలను తీవ్రంగా ఉపాసన చేస్తుంటారు. కులు నుంచి మానస సరోవరం దాకా వేలాది సిద్ధులు, నాగాలు, అఘోరాలు ఈ మంత్రాలను ఉపాసిస్తుంటారు.

విచిత్రమేమంటే, ఈ మంత్రాలన్నీ కూడా దేవతలకు వ్యతిరేకంగా, వారిని నిందిస్తూ నిందాస్తుతిలో ఉంటాయి. మనం సాధారణంగా వినే క్షుద్ర మంత్రాలంటే ఇవే. వీటిని ఉపాసించిన వారికి కొన్ని సిద్ధులు లభిస్తాయని, భూతాలను వశం చేసుకుని వాటిచేత కావలసిన పనులు కూడా చేయించుకోవచ్చని స్థానికులు నమ్ముతారు. దీన్ని పాండు లిపి అని కూడా అంటారు. దేవీదేవతలను నిందించే విధంగా ఉన్న మంత్రాలు కాబట్టే వీటిని చూస్తే అపశకునంగా కూడా స్థానికులు బలంగా విశ్వసిస్తారు. ఇంకో విచిత్రం ఏమంటే ఈ మంత్రాలను రాసేందుకు మనిషి రక్తాన్ని, జంతు రక్తాన్ని ఇంకా వాడతారని కూడా చెప్తారు. అందుకే ఈ లిపిని చూసినా, చదువుతుంటే విన్నా అశుభమేనని విశ్వసిస్తారు. ఈ భూతలిపికి ఓ శాస్త్రం లేదు.. వ్యాకరణం లేదు.. కేవలం గురుశిష్య పరంపర ద్వారా ఇది వ్యాపిస్తూ వస్తున్నదే తప్ప.. దీనికి ఓ అస్తిత్వం అంటూ లేదు. కొందరికి మాత్రమే.. ఉపాసన చేస్తున్న వారికి మాత్రమే వీటి పరిభాష అర్థమవుతుంది. ఇవి నిజంగా ఎంతవరకు సిద్ధిస్తాయి.. ఎంతవరకు డీకోడ్ అవుతాయనేది వారికి మాత్రమే తెలుసు. మనం వాటి వింతలను వినటమే తప్ప.. హేతుబద్ధతను కచ్చితంగా నిర్ధారించలేం.

**కోవెల సంతోష్ కుమార్**
రచయిత91 9052116463

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.